జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ   మంగళవారం 8 సెప్టెంబర్ 2026   సంపుటి : 01   సంచిక :236   పేజీలు : 12   వెల : 3/-   PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI   http://www.prajajyothinews.com   Mail: prajajyothidaily@gmail.com



# సైబర్ నేరాలపై పోలీసుల యుద్ధం

**"సైబర్ గార్డ్"తో 24X7 అలర్ట్**

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఐ4సీ తరహాలో స్టేట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్**

**259 మందితో టీం, ఐజీ స్థాయి అధికారి నేతృత్వం**

**సిద్ధం చేస్తున్న పోలీసు శాఖ**

**అమరావతి**

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా స్టేట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఎస్4సీ)ను రాష్ట్ర పోలీసు శాఖ ఏర్పాటు చేస్తోంది. ఈ విభాగానికి 'సైబర్ గార్డ్' అని పేరు పెట్టారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) తరహాలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. విజయవాడ-గుంటూరు మార్గంలో కాజ టోల్‌ప్లాజా సమీపంలోని ప్రభల టెక్‌పార్క్‌లో రూ.10.77 కోట్లతో దీన్ని నెలకొల్పుతున్నారు. 259 మందితో పనిచేయనున్న ఈ విభాగానికి ఐజీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు.

సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటెలిజెన్స్, సైబర్ దాడుల ముప్పు పర్యవేక్షణ, వివిధ శాఖలతో కలిసి సమన్వయంతో కూడిన ప్రతిస్పందన సహా పలు కీలక విధులను 'సైబర్ గార్డ్' నిర్వహించనుంది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు పరికరాలు, డిజిటల్ ఫోరెన్సిక్ టూల్స్, సైబర్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంలు, సాఫ్ట్‌వేర్‌లను సమకూరుస్తున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందే కాకుండా సాంకేతిక నిపుణులు, సైబర్ ఎనలిస్ట్‌లు, డిజిటల్ ఫోరెన్సిక్ సిబ్బంది, బ్యాంక్, టెలికాం సంస్థల తరఫున వాటి సమన్వయకర్తలు, 24 గంటలూ పనిచేసే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు వచ్చే కాల్స్‌ను విశ్లేషించే సిబ్బంది ఇలా వివిధ విభాగాల సమాహారంగా సైబర్ గార్డ్ పనిచేయనుంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ కేంద్రం ప్రత్యేకతలివీ. ఐపీ చిరునామాలు, బ్యాంక్ ఖాతాలు, టవర్ లొకేషన్‌లను ట్రాకింగ్ చేస్తారు. ఇతర మార్గాల ద్వారా నేరగాళ్ల ఉనికి, అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్థావరాలను గుర్తించి, దాడులు నిర్వహిస్తారు. ఐపీ చిరునామాలు, సర్వర్ లాగ్స్, ట్రాన్సాక్షన్ ఐడీలు, నెట్‌వర్క్ రికార్డులను సేకరించి భద్రపరుస్తారు. డిజిటల్ ఆధారాలు సేకరించి నేరగాళ్లకు శిక్షలు పడేలా చూస్తారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌లు, ఫోరంలలోని బహిరంగ - మిగతా3లో

# తాగునీటి కష్టాలకు చెక్




**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**రూ.2,370 కోట్లతో జలధార ప్రాజెక్టు పనులపై పవన్ దిశానిర్దేశం**

**తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు**

**పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో వేగంగా కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు**



కీలక ప్రతిపాదనలకు

## రక్షణ శాఖ పచ్చజెండా

- రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు
- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు
- అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం

# కార్యకర్తలే పార్టీకి బలం

- వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు
- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు



**అమరావతి**

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని - మిగతా3లో



ప్రైవేటు రంగానికి

## ప్రోత్సాహం

- ఇస్రో ఒక్కటే అది చేయలేదు
- కచ్చితంగా ప్రైవేటు భాగస్వామ్యం అవసరం
- భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించడంలో పరిశ్రమల పాత్ర పెరగాలి
- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కీలక వ్యాఖ్యలు

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది : కాంగ్రెస్
- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్



## స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం

# అభినందనీయం

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- వెంకటాచలంలో స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- వేడుకలకు హాజరైన వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్



**అమరావతి**

స్వర్ణభారత్ ట్రస్ట్ పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వారి కోసం అన్ని రకాల వసతులూ కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లలకు చదువు చెప్పడం అనేది గొప్ప సమాజ సేవన్నారు. యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవంలో ఆయన ముఖ్య - మిగతా3లో

# కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.



**రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

**ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు**

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.

**98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరణ**

భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించేందుకు మన దేశీయ పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పిలుపునిచ్చారు. ఉపగ్రహాలకు, ప్రయోగాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కేవలం ఇస్రో ఒక్కటే తీర్చలేదు అని ఆయన నొక్కి చెప్పారు. నేడు ప్రైవేటు రంగ భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి, ప్రతిష్ఠాత్మక మిషన్లు, అంతర్జాతీయ సహకారంతో కూడిన కొత్త దశలోకి భారత అంతరిక్ష కార్యక్రమం అడుగుపెడుతోందని వి.నారాయణన్ పేర్కొన్నారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో 2026 (9వ ఎడిషన్)లో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.



"ప్రస్తుతం అంతరిక్షంలో మనకు సంబంధించిన అసెట్స్? (ఉపగ్రహాలు) 56 మాత్రమే ఉన్నాయి. కానీ మన అవసరాలు తీర్చేందుకు ఇంకా చాలా ఉపగ్రహాలు కావాల్సి ఉంది. రానున్న 6-7 ఏళ్లలో కనీసం 200 నుంచి 300 ఉపగ్రహాలను తయారు చేసి ప్రయోగించాల్సి ఉంది. ఈ పనిని కేవలం ఇస్రో మాత్రమే చేయలేదు."

ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రైవేటు అంతరిక్ష కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడానికి ఇన్?-స్పేస్? (×చీ-చ్రూాజవ) సంస్థ పనిచేస్తోందన్నారు. అలాగే వాణిజ్య పురోగతికి మద్దతు ఇవ్వడంలో 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్? ' (ఎన్?ఎస్?ఐఎల్?) కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. భారత అంతరిక్ష రంగానికి దేశీయ పరిశ్రమలు అందిస్తున్న సహకారాన్ని నారాయణన్? కొనియాడారు. ఒక రాకెట్ ప్రయోగానికి అయ్యే బడ్జెట్లో దాదాపు 80 శాతం నిధులు భారతీయ పరిశ్రమలకే వెళ్తాయని ఆయన గుర్తు చేశారు. "పీఎస్?ఎల్?వీ, జీఎస్?ఎల్?వీ, ఎల్?వీఎం3 లాంటివాటి తయారీకి అయ్యే బడ్జెట్లో 80 శాతం భారతీయ పరిశ్రమలకే వెళ్తుందని మీరు అర్థం చేసుకోవాలి. భారత అంతరిక్ష కార్యక్రమం సాధిస్తున్న విజయం వెనుక మన దేశీయ పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యం ఉందని మీరు గుర్తించాలి" అని ఆయన అన్నారు.

**ఎక్కువ ప్రయోగాలు చేయాల్సిందే!**

ప్రస్తుతం మన దేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి దాదాపు 450 స్టార్టప్? కంపెనీలు పనిచేస్తున్నాయని వి.నారాయణన్? పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ స్టార్టప్ వ్యవస్థ ఎంతో బలంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే భారతదేశం తన అంతరిక్ష లక్ష్యాలను చేరుకోవాలంటే, రాకెట్ ప్రయోగాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'నేను 1984లో ఇస్రోలో చేరినప్పుడు, మూడేళ్లకు ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి రాకెట్ ప్రయోగించేవాళ్లం. కానీ ఇప్పుడు నెలకొక ప్రయోగం చేస్తున్నాం. అయితే ఇది సరిపోదు. మనం ఏడాదికి దాదాపు 50 ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రైవేటు రంగం భేష్?!**

ఇన్-స్పేస్? ఛైర్మన్? పవన్? గోయెంకా భారత్?లో ప్రైవేటు సంస్థలు అంతరిక్ష రంగంలో సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని వివరించారు. 2014లో కేవలం ఒకే ఒక స్పేస్ స్టార్టప్? ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 450 దాటిందని ఆయన అన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే ప్రైవేటు రంగం నుంచి 160 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇస్రో, ప్రైవేటు పరిశ్రమలు, ఇన్?-స్పేస్? మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి 'స్కైరూట్? ఏరోస్పేస్?' ఒక మంచి ఉదాహరణ అని గోయెంకా పేర్కొన్నారు. ఈ సంస్థ భారతదేశపు మొదటి ప్రైవేటు రాకెట్?ను అభివృద్ధి చేసి, కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపే సామర్థ్యాన్ని సాధించిందని ఆయన గుర్తు చేశారు.

"ఈ భాగస్వామ్యమే భారతదేశానికి ఉన్న అసలైన బలం. 6 దశాబ్దాల ఇస్రో అనుభవం, నేడు ప్రైవేట్ రంగంతో చేతులు కలిపింది. ఇస్రో, ప్రైవేట్ సంస్థలు కలిసికట్టుగా ఎదుగుతున్నాయి. ఇస్రో, ఇన్?-స్పేస్?, ఎన్?ఎస్?ఐఎల్?, ప్రైవేటు కంపెనీలు, ఎంఎస్?ఎంఈలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులతో కూడిన ఒక పూర్తి స్థాయి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను భారత్? నిర్మిస్తోంది" అని పవన్? గోయెంకా తెలిపారు. భారత కంపెనీలు తమ సేవల విలువను మరింత పెంచుకుంటూ, ప్రపంచ అవసరాలను తీర్చాలని కోరారు. అలాగే అంతర్జాతీయ కంపెనీలు భారతదేశాన్ని ఒక తయారీ, సాంకేతిక అభివృద్ధి, అంతరిక్ష భాగస్వామ్యాలకు ఒక ప్రధాన కేంద్రంగా చూడాలని ఆయన కోరారు.

# ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది

నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇవ్వడం పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.



"ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్?డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ (+ఖా) వృద్ధి రేటు "ఆర్థిక పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్**

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? ఈ మేరకు ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికే లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్? అన్నారు.

## మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్



భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## 'నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే'

**ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్**

**ఆరు నెలల గడువు కోరిన హైపవర్ కమిటీ**

**నవంబర్ 30లోగా తుది నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం**

**ఆలస్యం చేస్తే కమిటీని పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక**



ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఈ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఈ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ వ్యవహారాన్ని విచారించింది. కమిటీ కోరిన ఆరు నెలల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. ఆరావళి అంశాన్ని మరింత కాలం వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది.

**'రాత్రింబవళ్లు పనిచేయండి'**

కమిటీ అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రెండు నెలల సమయంలో నివేదిక ఇవ్వలేకపోతే ప్రస్తుత కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఆరావళి అంశం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహారాన్ని ఇకపై పెండింగ్‌లో ఉంచలేమన్న సంకేతాన్ని కోర్టు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక మధ్యంతర నివేదిక సిద్ధమైందని కోర్టుకు తెలిపారు. అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, మధ్యంతర నివేదిక కాకుండా తుది నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఆరావళి ప్రాంతంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా ప్రభావిత వర్గాలకు తగినంత సమయం ఇచ్చి వారి అభిప్రాయాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, మరింత సమయం అవసరమవుతుందని కోర్టుకు చెప్పారు.

**'గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలి'**

అయితే రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సమాజాలతో పాటు ఆరావళి ప్రాంతానికి సంబంధించిన అన్ని వర్గాల అభిప్రాయాలను కమిటీ తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. అవసరమైతే అత్యవసర అంశాలపై విడివిడిగా మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. తద్వారా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై కోర్టు వెంటనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, మైనింగ్ నియంత్రణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 2025 నవంబర్ 20న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆరావళి కొండలు, పర్వత శ్రేణికి ఏకరీతి నిర్వచనాన్ని ఆమోదించింది. స్థానిక భూభాగం నుంచి 100 మీటర్ల ఎత్తు ఉన్న భౌగోళిక ఆకృతులను ఆరావళి కొండలుగా పరిగణించాలని నిర్ణయించింది. అలాగే 500 మీటర్ల పరిధిలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలను ఆరావళి శ్రేణిగా పరిగణించేలా నిర్వచనం ఇచ్చింది. ఈ నిర్వచనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్త ప్రమాణాల వల్ల ఆరావళి ప్రాంతంలోని పెద్ద భాగం రక్షణ పరిధి నుంచి బయటపడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు, ఇతర వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో మైనింగ్ కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత డిసెంబర్‌లో ఆ తీర్పును రద్దు చేసింది. పాత కమిటీ సిఫార్సులను అమలులో లేకుండా చేసింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ ఆధారాలతో కొత్త నిర్వచనాన్ని సూచించేందుకు కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత డిసెంబర్ 2న ఆ కేసును సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది.

# స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం

-మొదటిపేజీ తరువాయి

అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసంగంలో భాగంగా అందరికీ వందనం అంటూ యోగి తెలుగులో మాట్లాడి సభికుల్లో ఉత్సాహం నింపారు. 'కరోనా మహమ్మారి వల్ల అనేకమంది తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ పిల్లలకు యూపీలో అటల్ ఆవాస్ విద్యాలయ్‌లో ఉచిత విద్య. మా గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు వెంకయ్యానాయుడే స్ఫూర్తి. సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడుకునే దేశమే ముందుకెళ్తోంది. ఎంత చదువుకుని, ఉన్నతస్థానానికి వెళ్లినా దేశం పట్ల భక్తి ఉండాలి, ఎక్కడికి వెళ్లినా నేషన్ ఫస్ట్ అనే భావన అందరిలో ఉండాలని' యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్?తోపాటు తదితరులు హాజరయ్యారు.

"స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం. సమాజసేవకు వెంకయ్యానాయుడు తీసుకున్న సంకల్పం గొప్పది. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్య తోపాటు నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా వెంకయ్యానాయుడు పని చేశారు. మన పల్లెలు జ్ఞానానికి, ఆర్థికాభివృద్ధికి మూలకేంద్రాలు. ఒకప్పుడు మన గ్రామాలన్నీ స్వయంపోషకాలుగా ఉండేవి. అందుకే గ్రామాలకు తరలండి అంటూ గాంధీజీ పిలుపునిచ్చారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం జాతి నిర్మాణానికి సాయం చేయడమే. ఎక్కడికి వెళ్లినా భారతీయులం అంటూ గర్వంగా చెప్పుకోవాలి. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ సదుపాయాలు ఉన్నాయి."



స్వర్ణభారత్ ట్రస్ట్ తనకు మానస పుత్రికని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చెప్పారు. తన పేరుపై ఉన్న ఆస్తులు ట్రస్ట్‌కే చెందుతాయని ప్రకటించారు. ప్రతిఒక్కరూ జీవితంలో కొంతభాగం సేవకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ దేశంలో చాలా వెనుకబడిన ప్రదేశంగా ఉండదేని గుర్తుచేశారు. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తర్‌ప్రదేశ్ ఉత్తమప్రదేశ్‌గా మారిందని ఆయన ప్రశంసించారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉచిత విద్య, వైద్యం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు.

అంతకుముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వాహకులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఆదిత్యనాథ్ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతకు ఇస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయ నిర్వహణను యోగి ప్రశంసించారు.

### మాతృభూమికి సేవ కోసం

గ్రామీణ సాధికారత, వికాసమే లక్ష్యంగా, సేవే పరమావధిగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు మానస పుత్రికగా 2001లో ఆవిర్భవించింది. వెంకయ్యానాయుడు స్ఫూర్తితో ఆయన మిత్రులు 8 మంది మాతృభూమికి సేవ చేయాలన్న సంకల్పంతో దీనిని ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నెలకొల్పిన ట్రస్ట్ సేవలు బహుముఖంగా విస్తరించాయి. విజయవాడ సమీపంలోని ఆత్కూరు, హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ శాఖలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున శిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

రాజకీయ కార్యక్రమాలకు తావులేకుండా ప్రభుత్వాల నుంచి సాయం, నిధులు ఆశించకుండా, భావసారూప్యం, సేవాతత్పరత గల వ్యక్తులు, సంస్థల భాగస్వామ్యం, సహకారంతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఈ పాతికేళ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన లక్షల మంది పేదలు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత జీవితాల్లో వెలుగులు నింపింది. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణ, గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు కృషి చేయడం అనే లక్ష్యాలను త్రికరణ శుద్ధిగా ఆచరిస్తోంది.

# పాదయాత్రల కౌంటర్...

**విజయవాడ :** ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు. 2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం. గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని



మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది. ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు. జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

## కార్యకర్తలే పార్టీకి బలం..

-మొదటిపేజీ తరువాయి

హెచ్చరించారు.

### విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

## తాగునీటి కష్టాలకు చెక్

తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏడాది చివరినాటికి పూర్తి చేయాల్సిన లక్ష్యాలను నెలలు, వారాల వారీగా విభజించుకుని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. తద్వారా పనుల్లో వేగం పెరిగి నిర్దేశిత గడువులోపు ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన 'చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్' పనుల పురోగతిపై పవన్ సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అధికారులు తెలుపుతున్నారు. కేంద్ర నిధులు ఉపయోగించుకుని జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతీ ఒక్కరి దాహార్తి తీర్చాలనే సంకల్పాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరజీవి జలధార రూపంలో ముందుకు తీసుకెళు న్నారు. అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్‌జీవన్‌మిషన్ గడువును 2028 వరకు పొడిగించారు. జల్‌జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్తున్నారు.

అందులో మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో 5 జిల్లాల పరిధిలో చేపట్టిన 5 మెగా వాటర్ గ్రిడ్ పథకాల్లో చిత్తూరు కూడా ఒకటి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్ఠాత్మక తాగునీటి సరఫరా పనులు చేపట్టినట్లు సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా వినియోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా 3 నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లో ఉన్న 3,163 ఆవాసాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. సుమారు 25 లక్షల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

### నాణ్యతా లోపాలు లేకుండా

చిత్తూరు మల్టీ విలేజ్ తాగునీటి పథకానికి సంబంధించి గండికోట వద్ద ఇంటేక్ వెల్ నిర్మాణం జరుగుతోంది. నాలుగు రా వాటర్ సంపులు నిర్మించాల్సి ఉండగా, మూడింటి పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం, గుర్రంకొండ వద్ద 75 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఒక నీటి శుద్ధి కేంద్రం, వెలిగల్లు వద్ద 26 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు 130 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. 7 నీటి సంపులు, 5 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 14 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు.

## సైబర్ నేరాలపై పోలీసుల యుద్ధం

-మొదటిపేజీ తరువాయి



సమాచారాన్ని సేకరిస్తారు. డార్క్‌వెబ్ మార్కెట్ ప్లేస్‌లు, హ్యాకర్ గ్రూపులు, ఎన్‌క్రిప్టెడ్ చాట్‌లలో జరిగే డేటా విక్రయాలు, మాల్‌వేర్ డీల్స్‌ను పర్యవేక్షిస్తారు. ఐపీ చిరునామాలు, డొమైన్ నేమ్‌లు, మాల్‌వేర్ శాంపిల్స్, సిస్టమ్ లాగ్‌లను రికార్డు చేస్తారు. నేరగాళ్లు వాడిన టెక్నిక్స్, ప్యాటర్న్ గమనిస్తారు. దాడులు, నేరాలను ముందుగానే అంచనా వేసి హెచ్చరికలు జారీచేస్తారు.

### శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణ

సైబర్ నేరాల్లో వాడిన డిజిటల్ పరికరాల నుంచి సాక్ష్యాలు, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరిస్తారు. నేరగాళ్లు వాడిన కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, హార్డ్‌డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌ల్లోని డేటాను రికవరీ చేసి, భద్రపరుస్తారు విశ్లేషిస్తారు. ఆ ఆధారాలను న్యాయస్థానాల్లో సమర్పించేందుకు వీలుగా నివేదికలు రూపొందిస్తారు.

సొత్తు విత్ డ్రా చేసే వీల్లేకుండా హోల్డ్ : సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొత్తు ఏయే మ్యూల్ ఖాతాలకు, డిజిటల్ వాలెట్‌లకు, క్రిప్టో కరెన్సీకి మళ్లిందో సిబ్బంది ట్రాక్ చేస్తారు. ఆ సొత్తును నేరగాళ్లు తీసుకోకుండా వెంటనే ఖాతాలను స్తంభింపజేస్తారు. బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదిస్తే సంబంధిత బ్యాంకులకు వెంటనే ఆటోమేటెడ్ సందేశాలు వెళ్లేలా చూస్తారు. దోచేసిన సొత్తును విత్ డ్రా చేసే వీల్లేకుండా హోల్డ్‌లో పెడతారు.

### ముందుగానే ముప్పు గుర్తింపు

రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాలు, కీలక రంగాల నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు జరగక ముందే ముప్పు గుర్తిస్తారు. అనధికార లాగిన్ యత్నాలు, పరిమితికి మించి డేటా బదిలీ తదితర అనుమానాస్పద చర్యలను కృత్రిమ మేధతో పసిగడతారు. కొత్తగా వస్తున్న మాల్‌వేర్‌లు, వైరస్‌లు, అంతర్జాతీయ హ్యాకింగ్ గ్రూపుల వ్యూహాల సమాచారాన్ని సేకరించి సిస్టమ్‌లను నవీకరిస్తారు.

నేరపూరిత కార్యకలాపాల కోసం సైబర్ గస్తీ : నేరపూరిత డిజిటల్ కార్యకలాపాలను గుర్తించేందుకు సైబర్ గస్తీ నిర్వహిస్తారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు, దేశభద్రతకు భంగం కలిగించే, హింసను ప్రేరేపించే, విద్వేషాలు రెచ్చగొట్టే సమాచారాన్ని పరిశీలిస్తారు. ఆన్‌లైన్ వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీ తదితరాలను ముందే గుర్తించి అడ్డుకుంటారు. ఫిషింగ్ లింక్‌లు, నకిలీ పెట్టుబడి యాప్‌లు, మోసపూరిత ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్‌లను ఎప్పటికప్పుడు బ్లాక్ చేస్తారు. డార్క్‌నెట్‌లో జరిగే అక్రమ ఆయుధాల విక్రయం, మత్తు పదార్థాల సరఫరా, హ్యాకింగ్ టూల్స్, దొంగిలించిన డేటా విక్రయాలపై కన్నేసి ఉంచుతారు.

దర్యాప్తు అధికారులకు సంక్లిష్ట సాంకేతిక విషయాల్లో తక్షణ సాయం, విశ్లేషణ, నైపుణ్యాన్ని అందించేందుకు టెక్నికల్ అసిస్టెన్స్ యూనిట్ సైబర్ గార్డ్‌లో అంతర్భాగంగా ఉంటుంది. సైబర్ నేరాలను అరికట్టడానికి, బాధితుల ఆర్థికనష్టాన్ని తగ్గించటానికి, దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు, ఫైనాన్షియల్ గేట్‌వేలు, టెలికాం సంస్థలతో కలిసి పోలీసులు ఇక్కడి నుంచి పనిచేస్తారు.

## వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

**తిరుపతి :** చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

## స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

**శ్రీకాకుళం :** స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

# రాష్ట్రంలో పెన్షన్ల జాతర!..





**మీ దీవెనలుకూటని ప్రభుత్వంపై ఉంచండి!..**

**మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం!..**

**తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**

**జడ్పీ.టి.సి వల్ల రంగారెడ్డి!..**

**వి.ఆర్.పురం, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** మీ ఆశీస్సులు కూటమి ప్రభుత్వానికి ఉండాలని, ఇచ్చిన మాటకు కట్టుబడి నూతన పెన్షన్లకు అవకాశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కల్పించారని, జడ్పీ.టి.సి.వల్ల రంగారెడ్డి, తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్,స్పష్టం చేశారు. సోమవారం వరరామచంద్రాపురం, సచివాలయంలో రేఖపల్లి సచివాలయంలో నూతన పెన్షన్ల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నమ్మకం అంటే ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుని, మరోమారు నిరూపించారు పేర్కొన్నారు. ఒంటరి, మహిళలు, వితంతువులు వృద్ధులు, వికలాంగులు, పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని వివరించారు. ఒకప్రక్క పెన్షన్లు, ఒకప్రక్క అభివృద్ధి, మరోప్రక్క ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇధికాధా కూటమి ప్రభుత్వం అంటేని వారుఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పెన్షన్ల జాతర, జరుగుతుందని అవ్వా, తాత, ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, కూటమి ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారని వారన్నారు. ఈ వారంలో పెన్షన్ల ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పెన్షన్ల దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ గొంది చంద్రయ్య,మాజీ ప్రెసిడెంట్ ముత్యాల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు సవలం రాజేంద్రప్రసాద్,తదితరులు హాజరయ్యారు.

# ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలి.. సిపిఐ.

## బనగానపల్లె ఆర్డీఓ, తహసీల్దార్‌కు సిపిఐ వినతి..



**బనగానపల్లె:సెప్టెంబర్=07 ప్రజాజ్యోతి బనగానపల్లె:** గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బనగానపల్లె మండలం సమితి ఆధ్వర్యంలో బనగానపల్లె ఆర్డీఓ, నరేంద్ర నాథ్ రెడ్డిగారికి తహసీల్దార్ చంద్ర శేఖర్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది పేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో, పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన ప్రతి ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినప్పుడు అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని వాటిని పరిశీలించాలి కాని కొన్ని గ్రామ సచివాలయాల్లో అధికారులు అర్జీలు తీసుకోవడం లేదు తీసుకున్న తిరిగి వెనక్కి ఇస్తున్నారు ఇది సైరైన పద్ధతి కాదని సిపిఐ నాయకులు ఆర్డీవో గారికి ఫిర్యాదు చేయడం జరిగింది అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పేదల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ శివయ్య సిపిఐ సీనియర్ నాయకులు జి సంజీవులు సిపిఐ నాయకులు పలుకూరు లక్ష్మయ్య సుబ్బయ్య కొత్తూరు సుబ్బరాజు పాల్గొన్నారు

# అర్ధరాత్రి జర్నలిస్టుల అదుపు..అసలు కథేంటి

**ఇద్దరు ఐ న్యూస్ రిపోర్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం పోలీసుల తీరుపై జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర చర్చ**

**మూడు రోజుల క్రితం టీడీపీ యువ నేతలపై ప్రసారమైన కథనమే కారణమా**

**కేసు నమోదు చేసి అరెస్టు చేశారనే ప్రచారం ఆచూకీ తెలియక కుటుంబసభ్యుల్లో ఆందోళన**

**ఐ న్యూస్ సీఈవో మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం**

**నంద్యాల:సెప్టెంబర్=07 ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లా నంద్యాలలో ఇద్దరు జర్నలిస్టుల అదుపులోకి తీసుకున్నారనే సమాచారం కలకలం రేపుతోంది.అర్ధరాత్రి సమయంలో ఐ న్యూస్‌కు చెందిన ఇద్దరు రిపోర్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుండగా..ఇప్పటి వరకు వారి ఆచూకీపై స్పష్టత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది కుటుంబసభ్యులు ఆందోళన చెందుతుండగా. సహచర పాత్రికేయులు సైతం వారి వివరాల కోసం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం

**మూడు రోజుల క్రితం కథనం..ఇప్పుడు కేసు**

నంద్యాలలో టీడీపీ యువ నాయకులకు సంబంధించిన ఓ అంశంపై మూడు రోజుల క్రితం ఐ న్యూస్ ఛానల్‌లో కథనం ప్రసారమైనట్లు తెలుస్తోంది.ఆ కథనంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసి,కేసు నమోదు చేసినట్లు, అదే వ్యవహారంలో ఇద్దరు రిపోర్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందిఅయితే కేసు నంబర్ ఏమిటి?ఏ సెక్షన్ల కింద కేసు పెట్టారు?ఎవరి ఫిర్యాదుపై నమోదు చేశారు..ఇద్దరినీ ఎక్కడ ఉంచారు.. అనే ప్రశ్నలకు మాత్రం ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది

**వార్త ప్రసారం చేస్తే.. అరెస్టేనా**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం,అధికారులను ప్రశ్నించడం పాత్రికేయుల ప్రాథమిక బాధ్యత..ప్రసారమైన వార్తపై అభ్యంతరం ఉంటే చట్టపరమైన మార్గాల్లో ఫిర్యాదు చేయడం,వివరణ కోరడం లేదా తగిన చర్యలు తీసుకోవడం ఒక విధానం.కానీ అరెస్టు జరిగిందనే సమాచారం బయటకు వచ్చి..అసలు ఏ కేసుఏ సెక్షన్లుఅరెస్టు ఎందుకుఎక్కడికి తరలించారు? అన్న వివరాలు తెలియకపోవడం జర్నలిస్టు వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది.

**అర్ధరాత్రి అదుపు..**
**కుటుంబాల్లో ఆందోళన**

ఇద్దరు జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు వారి ఆచూకీపై స్పష్టమైన సమాచారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.సహచర జర్నలిస్టులు కూడా సంబంధిత పోలీస్‌స్టేషన్లను సంప్రదిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు తెలియడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి అరెస్టు నిజమైతే చట్ట ప్రకారం కేసు వివరాలు, వర్తించిన సెక్షన్లు,అరెస్టుకు కారణాలు, ప్రస్తుతం వారిని ఎక్కడ ఉంచారు వంటి వివరాలను పోలీసులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు




**లోకేష్ దృష్టికి వ్యవహారం**

ఇదిలా ఉండగా..నంద్యాలలో ఐ న్యూస్ రిపోర్టర్లపై కేసు నమోదు చేయడం,పోలీసులు అత్యుత్సాహంగా వ్యవహరించారనే అంశాన్ని ఐ న్యూస్ ఛానల్ సీఈవో మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.ఈ అంశంపై ఉన్నతస్థాయిలో స్పందన వస్తుందా పోలీసు శాఖ నుంచి వివరణ వెలువడుతుందా..?? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

**పోలీసుల వివరణతోనే తెరపడేనా**

అసలు ఇద్దరు జర్నలిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారా తీసుకుంటే ఏ కేసులో ఎవరి ఫిర్యాదు మేరకుఏ సెక్షన్లు నమోదు చేశారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు అన్న ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది అరెస్టు జరిగిందనే ప్రచారంతోనే నిర్ణయానికి రావడం కాకుండా..పోలీసుల అధికారిక ప్రకటన,కేసు వివరాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది జర్నలిస్టుల కుటుంబాల ఆందోళనకు తెరదించేందుకు..పోలీసులు వెంటనే పూర్తి వివరాలు వెల్లడించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది

## మెలియాపుట్టి మండల కేంద్రంలో లైబ్రరీ నిర్మాణ స్థలం మార్పుపై గ్రామస్తుల వినతి





**మెలియాపుట్టి(ప్రతినిధి) పి. రవికుమార్ రెడ్డి ప్రజాజ్యోతి : సెప్టెంబర్ 7** మెలియాపుట్టి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి గాను అధికారులు ఎంపిక చేసిన స్థలంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత తహసీల్దార్ కార్యాలయం పక్కన, గత ప్రభుత్వ హాయంలో మంజూరైన ప్రస్తుతం కొత్త సచివాలయ భవన నిర్మాణం జరుగుతున్న స్థలంలో లైబ్రరీ నిర్మిస్తే, రాబోయే రోజుల్లో సచివాలయానికి వెళ్లే ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా, ప్రస్తుతం ఉపయోగిస్తున్న పంచాయతీ కార్యాలయం వెనుకవైపున ఉన్న సుమారు ఐదు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని లైబ్రరీ నిర్మాణానికి కేటాయించాలని గ్రామస్తులు కోరారు.అధికారులు గ్రామస్తుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని స్థలాన్ని మార్చి, పంచాయతీ కార్యాలయం వెనుక ప్రభుత్వ స్థలంలో లైబ్రరీ నిర్మాణం చేపట్టాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అనురాధ, హేమలత స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పరపటి రవికుమార్ రెడ్డి, గ్రామ యువకులు గాలి శంకర్, ధనుంజయ్, ప్రియాంక, పవన్, మణి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీలు నిర్వహించిన సీజనల్ వ్యాధుల అధికారులు



**సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఉరవకొండ పట్టణంలోని ఒకటవ సచివాలయం మరియు రెండో సచివాలయం పరిధిలోని పలు కాలనీలు వీధులలో సీజనల్ వ్యాధుల పైన ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు మరియు అవగాహన ర్యాలీలు గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారి సయ్యద్ సమీర్ మరియు ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి ల సమక్షంలో నిర్వహించడం జరిగింది పలు కాలనీలలో పట్టణంలో ఫీవర్ సర్వే నిర్వహించి దోమ కాటు వలన వ్యాపించే డెంగ్యూ మలేరియా చికెన్ గునియా మెదడువాపు బోధకాల వ్యాధి లక్షణాలు నివారణ చర్యలను గూర్చి ఇంటింటికి తిరిగి వివరించారు యాంటీ లార్వా ఆపరేషన్లు క్రిమి సంహారక మందులతో మలేరియా వర్కర్ల చేత నిర్వహించారు మురికి కాలువలలో అభ్ ట్ ద్రావణాన్ని చల్లారు ప్రజలు దోమలు బారిన పడకుండా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి తప్పక దోమతెరలను వాడాలన్నారు త్వరలో నీరు నిల్వ ఉన్నచోట దోమల గుడ్లు లార్వాలను నశింప చేయడానికి ఎంపీడీవో రవిప్రసాద్ చేతుల మీదుగా గంబోషియ చేప పిల్లల్ని వదులుతామన్నారు మలేరియా నుండి సంపూర్ణ రక్షణ పొందుటకై సాయంకాలం వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని ఇంటి బయట లేదా ఆరుబయట నిద్రపోయే సమయంలో ఎల్లప్పుడూ పొడువాటి దుస్తులను ధరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు ఈ ఫీవర్ సర్వే కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర( ఎం ఎల్ హెచ్ పి) శమంతకమణి ఏఎన్ఎం మరియు ఆశ ఆరోగ్య కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిత్యసర ధరలు తగ్గించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



**గుంతకల్లు సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు ఐద్వ మహిళా సంఘం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ ఎమ్మార్వో సుబ్బలక్ష్మి కి ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి.జ్యోతి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేము అధికారం లోకి వస్తే నిత్యవసర సరుకుల ధరలను తగ్గిస్తాము అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచడం జరిగింది.అయితే సామాన్య, కార్మిక, ప్రజల జీతాలు పెరగలేదు దిన కూలీల, వ్యవసాయ కూలీల కూలి రేట్లు పెరగలే దు కానీ ఎమ్మెల్యేల, ఎంపీల జీతాలు మాత్రం పెంచుతా రు సామాన్య ప్రజలకు ఉపయోగపడే నిత్యవసర సరుకుల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి ఇప్పుడు వర్షలు లేక రైతులు, కూలీలు, సామాన్య, పేద ప్రజలు చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమయంలో ములిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలం చెందాయి ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమాంతంగా పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలి. చౌక ధాన్యపు డిపోలలో ప్రజలకు ఉపయోగపడే అన్ని రకాల సరుకులు ఇవ్వాలి నిత్యవసర సరుకుల అందించాల, లేనిపక్షంలో ఐద్వా మహిళ సంఘం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ను కలుపుకొని రాష్ట్రవ్యా ప్తంగా దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం నాయకురాలు వడ్డే జయమ్మ, ప్రమీల, సరస్వతి, ప్రభావతి, శోభరాణి, జ్యోతి, శారద, శివమ్మ, రుతమ్మ, శ్రావణి, పట్టణ పౌరులు సంఘం నాయకులు ఉల్లిగప్ప, సి.నాగరాజు, రామయ్య, మంజునాథ్, వన్నురప్ప మరియు మహిళలు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఘాట్ పరిశీలించిన గుమ్మనూరు నారాయణస్వామి మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి



**గుంతకల్లు సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి):** పట్టణంలో సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి మరియు అధికారులతో కలిసి పరిశీలించారు. నిమజ్జన ఘాట్ వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారి, భద్రత, లైటింగ్ తదితర అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు.

## కొత్త పెన్షన్ దరఖాస్తు తేదీ గడువు పెంచాలి ఎఐవై ఎఫ్

పెన్షన్ ఇచ్చే విషయంలో రాజకీయ జోక్యం ఉండకూడదు

**అర్హులయినా ప్రతి పేదవారికీ పెన్షన్ షరతులు లేకుండా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి**

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజి ఆర్ ఎస్ ) లో డిఆర్ఓ రామ్ నాయక్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది**




**నంద్యాల:సెప్టెంబర్ =07 ప్రజాజ్యోతి** ఎఐవై ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు, పట్టణ కార్యదర్శి ఉదయ్ ఈ సందర్భంగా ఎఐవై ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పెన్షన్ దరఖాస్తుదారులు సమయం సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నారని పెన్షన్ దరఖాస్తు గడువును పెంచాలని వారన్నారు. అంతేకాకుండా సమయం తక్కువ ఇచ్చినందున సర్వర్లు బిజీ వచ్చి అప్డేట్ చేసుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తెలిపారు. పెన్షన్ దరఖాస్తుల విషయంలో పూర్తిగా రాజకీయ జోక్యం ఉండకుండా చర్యలు తీసుకొని అర్హులైనటువంటి ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

## ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 9న జిల్లా వ్యాప్త ఆందోళలను. జయప్రదం చేయండి. సిపిఐ.



**నంద్యాల:సెప్టెంబర్=07** ప్రజాజ్యోతి దేశంలో 2014 నుంచి 2026 వరకు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలపై పెనుభారంగా మారాయి. బియ్యం, కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి పప్పుధాన్యాల ధరలు పెరిగాయి. వంట నూనె, పాలు, చక్కెర, ఉప్పు ధరలు కూడా పెరిగాయి. ఉల్లి, టమాటా, బంగాళాదుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు తరచూ సామాన్యుడి అందుబాటును దాటుతున్నాయని పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా సెప్టెం బర్ 9వ తేదీ జరుగు ఆందోళనను సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయా లని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పిలుపునిచ్చారు దేశ రాష్ట్ర జిల్లా వ్యాప్తంగా పప్పులు, నూనెలు, నిత్యావసరాల ధరల దోపిడీకందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, శనగ పప్పు వంటి ప్రోటీన్ ఆహార పదార్థాలు సామాన్య కుటుంబాల భోజనంలో రోజురోజుకూ తగ్గుతున్నాయని వంటనూనెల ధరల పెరుగుదల ప్రతి కుటుంబం నెలవారీ బడ్జెట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తోందని పాలు, చక్కెర, ఉప్పు వంటి రోజువారీ అవసరాల ధరలు కూడా కుటుంబ ఖర్చులను పెంచుతున్నాయని అన్నారు. జిల్లాలో కూరగాయల ధరలు -- ప్రతి రోజూ కొత్త భారం. ఉల్లి, టమాటా, బంగాళాదుంప, వంకాయ వంటి కూరగాయల ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో సామాన్యుడికి అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. రైతు పొలంలో తక్కువ ధర, వినియోగదారుడి మార్కెట్‌లో ఎక్కువ ధర ఉండటానికి ప్రధాన కారణం మధ్యవర్తులు, దళారీలు, నిల్వదారుల దోపిడీ అని రైతు నష్టపోతున్నాడు వినియోగదారుడు నష్టపోతున్నాడని దళారీ మాత్రం లాభపడుతున్నాడని 2014 ఏప్రిల్‌లో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు 2.26, డీజిల్ 55.49 ఉండగా, 2026 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పెట్రోల్ 102.12, డీజిల్ ?95.20గా ఉన్నాయని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని వంటగ్యాస్ ధరలు కూడా పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతు న్నాయి. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ధరకు వంటగ్యాస్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య కుటుంబాలపై భారాన్ని తగ్గించాలని నల్లబజారు, అక్రమ నిల్వలు, దళారీ వ్యవస్థను అరికట్టాలనిప్రజలపై ధరల భారాన్ని మోపే విధానాలను ప్రతిఘటిస్తూ, ధరల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను విస్తృతంగా సమీకరించాలి. సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రత్యేక ప్రజాజ్యోతి కథనం




**నంద్యాల:సెప్టెంబర్=07 ప్రజాజ్యోతి** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం' కింద కొత్త పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ అధికారిక మార్గదర్శకాలతో ప్రారంభమైంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. దరఖాస్తు విధానం (ఎక్కడ ఇవ్వాలి కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలనుకునే అర్హులైన వారు తమ సమీపంలోని గ్రామ వార్డు సచివాలయాల కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ అసిస్టెంట్ దరఖాస్తును స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

**అవసరమైన పత్రాలు (డాక్యుమెంట్లు):**

అన్ని కేటగిరీల వారికి సాధారణంగా మరియు ప్రత్యేకంగా క్రింది పత్రాలు అవసరం ఉంటాయి

**అందరికీ కావలసినవి:**

ఆధార్ కార్డు రేషన్ కార్డు ఆదాయ ధృవీకరణ పత్రం సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక సర్టిఫికెట్

**కేటగిరీ వారీగా అదనపు పత్రాలు:** వృద్ధాప్యం ఆధార్ ద్వారా వయస్సు ధృవీకరణ.

తొలిగంపు / వితంతువు భర్త మరణ ధృవీకరణ పత్రం ం భర్త ఆధార్ నంబర్

## గ్రామాల పరిశుభ్రతకు బ్యాటరీ ఆటోలు



**బాపట్ల సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా బాపట్ల జిల్లాకు మంజూరైన నాలుగు బ్యాటరీ ఆటోలను సోమవారం ఆయా గ్రామ పంచాయతీలకు కలెక్టర్ పంపిణీ చేశారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని బ్యాటరీ వాహనాలను పారిశుధ్య నిర్వహణకు వినియోగించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగేలా ఈ వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములై గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. మంజూరైన నాలుగు బ్యాటరీ ఆటోల్లో రెండు సూర్యలంక గ్రామానికి, ఒకటి ముత్తాయపాలెం గ్రామానికి, మరొకటి రేపల్లె మండలం కామరాజుగడ్డ గ్రామ పంచాయతీకి కేటాయించారు. పర్యావరణహిత వాహనాలను జాగ్రత్తగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలని సంబంధిత గ్రామ పంచాయతీలకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సార్ నాకూ నా భర్తకు నా పిల్లలకు వారి నుంచి మాకు ప్రాణ హాని ఉంది మాకు రక్షణ కల్పించండి

-లక్ష్మి





**సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ :-** అనంతపురం జిల్లా పోలీస్ అధికారులకు నేను చేయు విన్నపం ఏమనగా సార్ మా పేరు లక్ష్మి వైఫ్ ఆఫ్ హరి మేము అనంతపురం జిల్లా కేంద్రం బుక్కరాయసముద్రం మండలం విజయ నగర్ కాలనీలో నివాసముంటున్నాము బేల్దారు పని చేసుకుని జీవనం సాగిస్తున్నాము. ఆదివారం సుమారు మూడు నాలుగు గంటల మధ్యలో అదే కాలనీకి చెందిన వెంకటలక్ష్మి,రమేష్,అనిల్, కవితా శశి,సాయి విజయలక్ష్మి మరియు కలెక్టర్ ఆఫీస్ రాణి నగర్ కు చెందిన కొందరు రౌడీషీటర్లు తో కలసి మా ఇల్లు మొత్తం మా ఇల్లు రేకులు సామగ్రి టీవీ గ్యాస్ బట్టలు ధ్వంసం చేసి ఏమాత్రం ఉండడానికి స్థావరం లేకుండా ధ్వంసం చేసి సుమారు 3 లక్షలు వరకు ఆస్తి నష్టం మరియు మా భర్తను నన్ను మా కూతురు ను మా అత్త ను చేసి విచక్షణ రహితంగా రాడ్లు మరణాయుధాలతో దాడి చేసి మా అత్తగారు అయినా నారాయణమ్మ ను వయసు 70 సంవత్సరాలు ముసలావిడ అని కూడా చూడకుండా రౌడీ షీటర్లతో మరణాయుధాలు తో దాడి చేసి మమ్మల్ని చంపడానికి వచ్చినారు. మమ్మల్ని చంపేయాలని చూసారు కానీ మేము తప్పించుకొని వచ్చా0 మాకు ఆస్తి నష్టం మమ్మల్ని చంపడానికి వచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుని వారి నుండి మాకు ప్రాణహాని ఉంది కావున మమ్మల్ని రక్షించాలని అలాగే వారిపై వెంటనే విచారణ జరిపి రిమాండ్కు తరలించాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నాము. మనకు ఏమైనా జరిగితే వారే బాధ్యత వహిస్తారని పత్రికా విలేకరులకు తెలియజేయడం జరిగింది కావున జిల్లా పోలీస్ అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టి మాకు న్యాయం చేయవలసిందిగా కోరుచున్నాము

## కార్యకర్తల సాధికారతే టీడీపీ బలం




**పర్చూరు సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కార్యకర్తలకు రాజకీయ అవకాశాలతో పాటు ఆర్థిక భద్రత కల్పించడమే టీడీపీ అధినేత చంద్రబాబు లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ ట్రైనింగ్ కాన్‌క్లేవ్‌లో రాజకీయ, ఆర్థిక సాధికారత అంశంపై ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల్లో నిరంతరం పనిచేసే బలమైన క్యాడర్ టీడీపీకి ఉందన్నారు. బూత్ స్థాయి నుంచి నాయకత్వం వరకు ఇప్పటికే వేలాది మంది కార్యకర్తలకు శిక్షణ అందించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగా నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించడం ద్వారా కార్యకర్తల్లో నమ్మకం పెంచుతున్నామన్నారు. కార్యకర్త కుటుంబాలకు అండగా రూ.5 లక్షల ప్రమాద బీమా, విద్య, వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఏలూరి పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు కోసం కాదని, కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించే వ్యవస్థగా మారుతోందన్నారు. రాజకీయ నేపథ్యం లేని తనలాంటి సాధారణ కార్యకర్తకు పర్చూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు ప్రతి కార్యకర్త ఆత్మగౌరవ విజయమని పేర్కొన్నారు. నారా లోకేష్ నేతృత్వంలో కార్యకర్తే అధినేత స్ఫూర్తితో నూతన తరం నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని, నా తెలుగుదేశం,నా బాధ్యత అనే భావనతో ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని ఏలూరి పిలుపునిచ్చారు.

## కరుట్లపల్లిలో టీడీపీ, వైఎస్సార్ నేతలు బీజేపీలో చేరిక



**సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి న్యూస్ శ్రీనివాస్ నాయుడు :-** కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అనంతపురంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర నాయకులు కాపు రామచంద్రరెడ్డి, చిరంజీవిరెడ్డి, కూడేరు మండల అధ్యక్షులు బి.గోపాల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్. ఆదర్శం, డి. ప్రవీణ్‌కుమార్, ఆ. ప్రశాంత్, కె. విష్ణుతేజ, బి. భాస్కర్, కె. నాగరాజు తదితరులు బీజేపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నాయకులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పలువురు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో కూడేరు మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కరుట్లపల్లి గ్రామంలో పలువురు నాయకులు బీజేపీలో చేరడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలి. ఇంటి గుత్తతో పింఛన్లను ముడి పెట్టవద్దు,

**పింఛన్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్న వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి**

**సెప్టెంబర్ 7 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** సిపిఎం గత కొన్ని సంవత్సరాలుగా పింఛన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పుతుండడంతో అర్హులైన పింఛన్ దారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని వారి ఆశలు అడియాసలయ్యే విధంగా ఒక్కొక్క డివిజన్ లో 80 మందికి మాత్రమే పింఛన్ ఇస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెపుతున్నట్లు ప్రచారం జరగడంతో పింఛన్ దారులు తమ ఆశలను వదులుకునేటువంటి పరిస్థితి వచ్చిందని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఇప్పటివరకు ఒక్క పింఛను కూడా ఇవ్వలేదని ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు దగ్గర పడటంతో పింఛన్లు ఇస్తామని చెప్పి హడావుడి చేస్తున్నారని అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని తెలిపారు. అదే విధంగా ఇంటి గుత్తలకు పింఛన్లను ముడి పెట్టడం అంటే నిజమైన లబ్ధిదారులను మోసం చేయడమేనని ఎవరైనా అర్హులు బాడుగ ఇళ్లల్లో నివసిస్తుంటే ఇంటి యజమాని ఏ విధంగా తన గుత్తల పేపర్లను వీరికి ఇస్తారని ప్రశ్నించారు. పేదలైనటువంటి వారు ఎక్కడైనా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి ఇంటి గుత్తలు వేయమని అనేకమార్లు ఆందోళన చేసిన ఇంటి గుత్తలు వేయని అధికారులు ఇప్పుడు ఇంటి గుత్తలు కావాలంటే ఏ విధంగా వస్తాయని కావున ఇంటి గుత్తలతో పింఛన్లను ముడిపెట్టరాదని కోరారు. అదేవిధంగా శ్రీ శ్రీ నగర్ లో గత 15 సంవత్సరాలు నుండి నివాసం ఉంటున్న వారికి ఇంటి పట్టాలు ాావిశ్రీవ ఇంటి గుత్తలు వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని అనేకమార్లు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిన ఫలితం లేదని తెలిపారు అలాగే పింఛన్లు ఇప్పిస్తామని చెప్పి కొందరు బ్రోకర్లుగా ఏర్పడి డివిజన్,కాలనీలలో తిరుగుతున్నారని పేద ప్రజలు అలాంటి వారి మాయలో పడే అవకాశం ఉందని కావున అధికారులు అర్హులైన వారందరిని గుర్తించి పింఛన్లు ఇప్పించే విధంగా కృషి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వీరాన్ రెడ్డి కోరారు.

## హెల్మెట్ తప్పనిసరి - తహసీల్దారు .......

**నూతన మోడల్ ద్విచక్ర వాహనాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం......**



**చాగలమర్రి , సెప్టెంబర్ 07( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తహసీల్దారు పణీంద్రుడు అన్నారు. సోమవారం స్థానిక రిక్వెస్ట్జీ సమీపంలోని బజాజ్ షోరుమ్‌లో పల్సర్ 125,150 సీసీ నూతన వర్షన్ ద్విచక్ర వాహనాలను తహసీల్దారు పణీంద్రుడు, టిడిపి నాయకులు పట్టణ టిడిపి అధ్యక్షుడు మౌళాలి,సల్లా నాగరాజు యాదవ్, హనీఫ్‌లు లు కేక్ కట్ చేసి ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దారు ,టిడిపి నాయకులను షోరూమ్ యజమాని ఫరూఖ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తి నరసింహులు, కరిముల్లా, రామతీర్థం రాజేంద్ర,వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి,బాలదస్తగిరి, బషీర్, నాగుర్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 11న మండల ఆఫీసుల వద్ద ధర్నాలను జయప్రదం చేయండి

**బి కె యం యు,**

**ఎ ఐ కె ఎస్, చేతివృత్తిదారుల సమాఖ్య పిలుపు**




**నంద్యాల:సెప్టెంబర్=07 ప్రజాజ్యోతి** ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల్లో ఉన్న నంద్యాల జిల్లాలోని అన్ని మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించాలని, ఈ డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 11న జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాలను పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,**

జిల్లాలో గత ఏడాది కొలిమిగుండ్ల, బేతంచర్ల, బనగానపల్లె, సంజామల, ఉయ్యాలవాడ అనే 5 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి నేటి వరకు కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటి నిల్వలు 41 టీఎంసీలకు పడిపోవడంతో కెసి కెనాల్ కింద వరి సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు 11.42 మీటర్ల లోతుకు పడిపోయి తాగునీటి ఎద్దడి తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గత రబీ 2023-24 సీజన్‌లో 13 మండలాల్లోని 58,011 మంది రైతులు పంట నష్టపోగా, రూ. 57.30 కోట్ల పరిహారం ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆ నిధులను విడుదల చేసి, బాధిత రైతాంగాన్ని, కార్మికులను ఆదుకోవాలని, సెప్టెంబర్ 11 ధర్నాతో పాలకుల కళ్లు తెరిపించాలని వారు పిలుపునిచ్చారు.

# బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

## పవిత్ర సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన ఆలయం

## అన్నప్రసాద సేవకు సహకరించిన వేముల సుబ్బారావు--కుమారి దంపతులు

**ఎటపాక, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):** పవిత్ర సోమవారం సందర్భంగా ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీ శివాలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు గొట్టుపుల్ల కృష్ణమాచార్యులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూనవరం మండలం పరిధిలోని టేకులబోరు గ్రామానికి చెందిన వేముల సుబ్బారావు--కుమారి దంపతులు అన్నప్రసాద వితరణకు సహకరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక సేవాభావంతో అన్నదానానికి ముందుకు వచ్చిన టేకులబోరు గ్రామానికి చెందిన వేముల సుబ్బారావు--కుమారి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు స్థానిక గ్రామస్తులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



బుట్టాయిగూడెం శివాలయంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దాతలు, ఆలయ కమిటీ సభ్యులు.

# కొత్తపల్లెను కరువు మండలంగా ప్రకటించకపోతే ఆమరణ దీక్షకు సిద్ధం




**నంద్యాల:సెప్టెంబర్=07 ప్రజ్ఞజ్యోతి** తాహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఐ కరువుతో అల్లాడుతున్న కొత్తపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్ట పోయిన రైతులకు ఎకరాకు 50వేలు చెల్లించాలని లేకపోతే వచ్చే సోమవారం లిఆమరణ దీక్షలికు దిగుతామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హేచ్చరించారు.. సోమవారం సిపిఐ మండల కార్యదర్శి వెంకటశివుడు ఆధ్వర్యంలో కరువు మండలంగా ప్రకటించాలని రైతులతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేశారు.. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు ఆత్మకూరు తాలూకా కార్యదర్శి ప్రతాపు మండల కార్యదర్శి వెంకట శివలు మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని 12 గ్రామాల్లో దాదాపు 7 వేల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారని ఎల్నినో ప్రభావం వల్ల ఇప్పటికే 6 వేల హెక్టర్ లలో చెడగొట్టి పశువులకు మేతగా ఉపయోగిస్తూ నష్టాలు ఊబిలో రైతులు ఉన్నారని కనీసం త్రాగడానికి కూడా నీరులేని పరిస్థితి ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ కై సర్వస్వం త్యాగం చేసిన ఈ ప్రాంత రైతాంగానికి కనీసం త్రాగడానికి కూడా నీరు అందించలేని స్థితిలో పాలకులు ఉన్నారంటే సిగ్గు తెచ్చుకోవాలని వారు విమర్శించారు. సిద్దాపురం ఎత్తిపోతల ద్వారా కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి,గువలకుంట్ల, వీరాపురం, పాలెం చెరువు, నందికుంట బావాపురం తదితర గ్రామాల ప్రజలకు రైతులకు ద్వారా త్రాగునీరు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుపై సర్వస్వం త్యాగం చేసిన కొత్తపల్లి మండల రైతాంగానికి సిద్దేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని వారి డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలం తో పాటు నందికొట్కూరు నియోజకవర్గం లో ఆరు మండలాలను కరువు మండలాలుగా గుర్తించి రైతుల నాదుకోవాలని నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.. మండలాలుగా ప్రకటించకపోతే వచ్చే సోమవారం ఆమరణ దీక్షకు రైతాంగం సిద్ధపడుతుందని వారు హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సిపిఐ నాయకులు దూద్ పీరా, మహిళా సమైక్య నాయకులు మూర్తిజాబీ, రైతు సంఘం నాయకులు షేక్షావలి, లింగారెడ్డి, బీమలింగం, సురేష్, బాలకృష్ణ,పెద్ద రాజు, చిన్న స్వామి, శ్రీనివాసులు, మోహన్ పుల్లారెడ్డి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు..

## డోన్,మున్సిపల్ ఆఫీసులో కులాల వారీ రిజర్వేషన్‌పై సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం,

**డోన్ ( ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 7,** నంద్యాల జిల్లాడోన్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కులాల వారీ రిజర్వేషన్‌కు సంబంధించిన విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలపై సచివాలయ సిబ్బందికిదిశానిర్దేశం చేశారు.రిజర్వేషన్‌కు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, సక్రమంగా నమోదు చేయడంతో పాటు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో, నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, కమిషనర్ నరేష్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శబరిస్, ా జు, సురేష్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు



## స్వర్గీయ జీయాఉద్దీన్ "సర్" జ్ఞాపకార్థం!..

**విశ్రాంతి హాల్ కు శంకుస్థాపన!..**

**రిటైర్ ఉపాధ్యాయులు సున్నం రాజులు!..**







**వి.ఆర్.పురం, సెప్టెంబర్7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పూర్వ ప్రాధానోపాధ్యాయులు, కీర్తిశేషులు స్వర్గీయ జీయాఉద్దీన్, జ్ఞాపాకార్థం, విశ్రాంతి భవన నిర్మాణానికి, సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు సున్నం రాజులు, శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం, వరరమచంద్రపురం మండలం సోముల గూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలి కొన్నత పాఠశాలలోపూర్వ విద్యార్థులు వెయిటింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఉపాధ్యాయులు సున్నంరాజులు, పాల్గొని మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సేవా నిరతిని కొనియాడారు. గురువులను స్మరించుకోవడం గొప్ప సంస్కారం అన్నారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువు జ్ఞాపకం శాశ్వతంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు.ఈ "హాల్" వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు భద్రమ్మ జ్యోతి, సరిత, దులమ్మ పున్నమ్మ, రాజేశ్వరి రమాదేవి ఉపాధ్యాయులు గ్రామపెద్దలు ఆసు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంచి వైద్యులపై కథనానికి స్పందన.. మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

**రెండు దుకాణాల్లో రికార్డులు చూపించలేదని గుర్తింపు.. ఫార్మాసిస్ట్ లేకపోవడంపైనా ఆరా**

**ఆర్ఎంపీలు, ప్రైవేట్ ప్రాక్టీషనర్లకు నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు: డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్**




**సాలూరు,ప్రజాజ్యోతి న్యూస్** ఏజెన్సీ ప్రాంతాల్లో అర్హత, అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నారనే ఆరోపణలపై ఇటీవల వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. పార్వతీపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ సోమవారం సాలూరు, మక్కువ మండలాల్లోని మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మందుల విక్రయాలు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? షెడ్యూల్ మందులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అన్న అంశాలను పరిశీలించారు. సూర్య మెడికల్ షాపులో రికార్డుల కొరత సాలూరు పట్టణ కేంద్రంలోని సూర్య మెడికల్ షాపును డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా సేల్ బిల్లులు, పర్చేస్ బిల్లులు, షెడ్యూల్ మందులకు సంబంధించిన రికార్డులు చూపించలేకపోయినట్లు ఆయన తెలిపారు. మందుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించడం తప్పనిసరి అని, ముఖ్యంగా షెడ్యూల్ మందుల విక్రయాల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. మక్కువలోనూ అదే పరిస్థితి అనంతరం మక్కువ మండల కేంద్రంలోని ఆరోగ్య మెడికల్ షాపులో కూడా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించారు. అక్కడ కూడా షెడ్యూల్ రికార్డులు, సేల్ బిల్లులు, పర్చేస్ బిల్లులు చూపించలేకపోయినట్లు యుగంధర్ తెలిపారు. అదేవిధంగా మెడికల్ షాపులో ఫార్మాసిస్ట్ అందుబాటులో లేకపోవడాన్ని కూడా గుర్తించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో గుర్తించిన

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**- 65 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో అగ్రహారం వీధిలో ఉన్న సత్యసాయి సేవా సమితి మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ అధ్యక్షత వహించారు.పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వీరిలో 27 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక వాహనంలో ఇదే రోజున విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ నేత్ర వైద్య సహాయకులు దీపక్ , సీనియర్ మేనేజర్ ఎన్ అప్పల రాజు , ఆప్తమాలిక్ అసిస్టెంట్ డి రామచంద్ర రవి సేవా సమితి సభ్యులు గుడ్ల సాయిరాజు మీసాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల జ్ఞాపకాలకు మళ్లీ ప్రాణం

### మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బాపట్ల సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఒకే పాఠశాలలో చదువుకున్న మిత్రులు. దశాబ్దాలు గడిచినా చెదరని స్నేహబంధంతో ఒక్కటయ్యారు. బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో 1989,1994 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బాపట్ల ఏపీ ఎన్జీవో హోంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంతో సమ్మేళనం ఘనంగా ముగిసింది.మూడు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు ఒకే తరగతి గదిలో చదువుకున్న వారిలో పలువురు ప్రస్తుతం వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ ఉన్నత హోదాల్లో కొనసాగుతుండటం విశేషం.వృత్తి, హోదాలతో సంబంధం లేకుండా చిన్ననాటి స్నేహితులంతా ఆత్మీయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులు అందించిన విద్య, క్రమశిక్షణ, విలువలు తమ జీవితాల్లో ఎంతో ప్రభావం చూపాయని గుర్తుచేసుకున్నారు. రెండు రోజుల పాటు సాగిన ఈ ఆత్మీయ సమ్మేళనం నవ్వులు, జ్ఞాపకాలు, స్నేహపూర్వక పలకరింపులతో సందడిగా సాగింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్లో డ్రైవర్‌కు జైలు శిక్ష .........



**చాగలమర్రి , సెప్టెంబర్ 07( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగల మర్రి పట్టణం గుండా సాగే 40 వ జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి ఆళ్లగడ్డ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ కోర్టు 5 రోజుల జైలు శిక్ష విధించి నట్లు ఎస్సై రాజారెడ్డి తెలియజేశారు. సోమవారం తెల్లవారు ఝామున టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన డ్రంక్అండ్ డ్రైవ్ కేసులో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం కు చెందిన ఎల్లో ప్రైవేట్ ట్రావెల్స్ తిరుపతి నుంచి హైదరాబాదుకు వెల్తున్న బస్సు డ్రైవర్ విట్టల్ మద్యం తాగి బస్సు నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. ఆళ్ళగడ్డ కోర్టులో హాజరుపరుచగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ కోర్టు జడ్జి రవికుమార్ 5 రోజుల జైలు శిక్ష విధించారని తెలియజేశారు.వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ హెచ్చరించారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**రెండు ట్రాక్టర్లు సీజ్**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఎటపాక సీఐ వి.కృష్ణ, ఎస్సై జి.అప్పలరాజు**



**ఎటపాక, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండల పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎటపాక పోలీసులు శనివారం నెల్లిపాక గ్రామ సమీపంలో పట్టుకుని సీజ్ చేశారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, ఎస్సై జి.అప్పలరాజు తమ సిబ్బందితో కలిసి నెల్లిపాక పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను లోడ్ చేసుకుని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి తక్షణమే అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ వి.కృష్ణ, ఎస్సై జి.అప్పలరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రీచ్‌ల నుంచి తవ్వకాలు జరపడం, అక్రమంగా తరలించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. సహజ వనరులను కొల్లగొడుతూ నిబంధనలు తుంగలో తొక్కేవారిని ఉపేక్షించేది లేదని, అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు, వాహన యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలింపులు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని వారు ప్రజలను కోరారు.

## బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

**- ఆరు కేసులు నమోదు..ఆరుగురు అరెస్ట్**

**- 41 మద్యం బాటిళ్లు స్వాధీనం**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై. రాజు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు.ఈ తనిఖీల్లో మొత్తం ఆరు కేసులు నమోదు చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అనధికారికంగా మద్యం విక్రయించడం, కల్తీ మద్యం తయారీ లేదా విక్రయాలు గంజాయి, సారా తదితర నిషేధిత మత్తు పదార్థాల క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై రాజు హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## సెప్టెంబర్ 7 నుంచి పెన్షన్ దరఖాస్తులు

**- అర్హులైన వారు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

**- ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**- ఎంపిడిఓ ఎస్ వాసుదేవ రావు**



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధి విధానాలను ఖరారు చేసిన నేపథ్యంలో అర్హులైన వారి నుంచి పెన్షన్ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పొందూరు ఎంపిడిఓ ఎస్ వాసుదేవ రావు తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అర్హులైన వారు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అర్హత ఉన్న వారు తమకు సమీపంలోని గ్రామ సచివాలయాన్ని సంప్రదించి అక్కడి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పెన్షన్ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు నమోదు చేసిన అనంతరం తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని అధికారులు తెలిపారు.పొందూరు మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి పెన్షన్ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే అర్హులైన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీవో సూచించారు.దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 16లోగా పెన్షన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# సాంకేతిక నిఘాతో పోయిన ఫోన్లకు జాడ




**బాపట్ల సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో బాపట్ల జిల్లా పోలీసులు మరోసారి సత్తా చాటారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏడో విడత మొబైల్ రికవరీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ 251 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఇప్పటి వరకు ఏడు విడతల్లో 1,572 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.3.14 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు. తాజా విడతలోనే రూ.50.20 లక్షల విలువైన ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించినట్లు వెల్లడించారు పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు జిల్లా కేంద్రంలో సాంకేతిక నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. స్థానిక పోలీసులతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల పోలీసు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఫోన్లను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నమోదైన ఫిర్యాదుల్లో సుమారు 72 శాతం మొబైల్ ఫోన్లను రికవరీ చేయగలిగామని చెప్పారు. మొబైల్ ఫోన్ ప్రస్తుతం వ్యక్తిగత సమాచారంతో పాటు ఆర్థిక లావాదేవీలకు కూడా కీలక సాధనంగా మారిందని ఎస్పీ పేర్కొన్నారు. ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఇదిలా ఉండగా, తక్కువ ధరకు వస్తుందనే ఉద్దేశంతో బిల్లులు, యాజమాన్య ధ్రువపత్రాలు లేని సెకండ్‌హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని ఎస్పీ హెచ్చరించారు. దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మొబైల్ వ్యాపారులు కూడా ఫోన్ యాజమాన్య వివరాలు, బిల్లులను పరిశీలించిన తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఫోన్లు విక్రయించేందుకు ప్రయత్నించినా, లాక్ తొలగించమని సంప్రదించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొరికిన మొబైల్ ఫోన్‌ను సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫోన్ల రికవరీలో కీలకంగా పనిచేసిన సోషల్ మీడియా సీఐ వి.సూర్యనారాయణ, ఎస్ఐలు నాగేశ్వరరావు, అనూషతో పాటు ప్రత్యేక బృంద సభ్యులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్, బాపట్ల డీఎస్పీ సీహెచ్.చంద్రమౌళి, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఎస్బీ సీఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాబోవు ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి!..

**బి.జె.పి,పార్టీ మండల ప్రధాన కార్యదర్శిఉయికా రత్తయ్య!..**

**సీనియర్ నాయకులు కారం ధారయ్య!..**



**వి.ఆర్.పురం, సెప్టెంబర్7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** రాబోవు ఎన్నికల్లో కూటమిగా, ఎన్నికల్లో వార్డ్ సభ్యులుగా పోటీలో నిలిచేందుకు భారతీయ జనతా పార్టీ, (బి.జె.పి) నాయకులు, కార్యకర్తలు, సిద్ధంగా ఉండాలని, భారతీయ జనతాపార్టీ నాయకులు కారం ధారయ్య, ముత్యాల రాంబాబు, కార్యకర్తలకు సూచనలు చేశారు. సోమవారం భారతీయ జనతా పార్టీ, మండల ప్రధాన కార్యదర్శి ఉయికా రత్తయ్య, అధ్యక్ష తన వర రామచంద్రాపురం, మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయికా రత్తయ్య, ధారయ్య, మాట్లాడుతూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి నాయకులతో కలిసి మనకు బలంగా ఉన్నచోట వార్డ్మెంబర్, ఎం.పి.టి.సి,ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులకి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, పిలుపు నిచ్చారు. కార్యకర్తలు సమిష్టి కృషి చేసి బలోపేతం చేసేందుకు ఉత్సాహంగా పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అలాగే సీనియర్ నాయకులు సన్యాసి మల్లయ్య, కడుపు రాజేంద్ర ప్రసాద్, గిరిజన మోర్చా డివిజన్ నాయకులు సొంది నాగేశ్వరరావు, గూటల రాంబాబు, తూర్రె వెంకట నారాయణ, సీనియర్ నాయకులు కడుపు వెంకటరమణ, మొట్టుమ్ బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో ఉన్నటువంటి వివిధ సంఘాలకి నిరసన ర్యాలీకి పిలుపు!

**-ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ గారిపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన.**







**ప్రజా జ్యోతి న్యూస్ సెప్టెంబర్ 7 రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఈ రోజు బాబాసాహెబ్ అంబేద్కర్ గారి గౌరవాన్ని, ఆయన అందించిన భారత రాజ్యాంగ విలువలను కించపరిచే విధంగా చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నాము.పూలే అంబేద్కర్ వాదులు బహుజన ప్రజా సంఘాల నాయకులు భారత రాజ్యాంగ లబ్ధిదారుల అంబేద్కర్ అభిమానులు ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము ప్రజాబలం రామప్ప నాయక్ పత్రిక విలేకరులకు తెలియజేశారు.

# తుది ఓటర్ల జాబితా విడుదల

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఇతర వర్గాల వారీగా వివరాల పరిశీలన**

**పారదర్శకంగా జాబితా సవరణ పూర్తి చేసిన అధికారులు**



**బేతంచర్ల:సెప్టెంబర్ 7(ప్రజా జ్యోతి)** మండల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అధికారులు నిబంధనల మేరకు పూర్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఇతర వర్గాలకు చెందిన ఓటర్ల వివరాలను గ్రామాల వారీగా పరిశీలించి తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రకటించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎం. ఫజల్ రహిమాన్ ఆధ్వర్యంలో తుది ఓటర్ల జాబితా ప్రకటన కార్యక్రమం నిర్వహించారు. సవరణ ప్రక్రియలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలు, అభ్యర్థనలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టిన అనంతరం తుది జాబితాను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం. ఫజల్ రహిమాన్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా ఖచ్చితమైన వివరాలతో జాబితాను రూపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఇతర వర్గాలకు చెందిన ఓటర్ల వివరాలను గ్రామాల వారీగా పరిశీలించి తుది జాబితాలో పొందుపరిచినట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత గ్రామ పంచాయతీలలో తుది ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, ప్రజలు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రకటనతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక దశ పూర్తయిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి. మల్లికార్జున, సంబంధిత పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతోనే రైతుకు లాభం, సమాజానికి స్వచ్ఛమైన ఆరోగ్యం: తహసీల్దార్ భారతి..



**ప్రజాజ్యోతి ప్యాపిలి సెప్టెంబర్ 7 ప్యాపిలి:** రసాయన రహిత ప్రకృతి సాగు విధానాలు రైతులకు ఆర్థిక భరోసానివ్వడంతో పాటు యావత్ సమాజానికి మేలైన ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని స్థానిక తహసీల్దార్ భారతి పేర్కొన్నారు. ప్యాపిలి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని (స్టాల్) ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ప్రకృతి సిద్ధంగా పండించిన పలు రకాల ఆహార ఉత్పత్తులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతను మెచ్చుకున్నారు. అనంతరం తహసీల్దార్ భారతి మాట్లాడుతూ.."నేటి కాలంలో రసాయన అవశేషాలు లేని స్వచ్ఛమైన ఆహారోత్పత్తుల ఆవశ్యకత ఎంతగానో పెరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గి, నికర లాభాలు సమకూరుతాయని" తెలిపారు. అదే సమయంలో నేల సారాన్ని పునరుద్ధరిస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఈ సాగు విధానం కీలకంగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజలందరూ విషరహిత, సహజసిద్ధమైన ఆహారాన్ని నిత్య జీవితంలో అలవర్చుకుని దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరాజులు, రవి కుమార్, నీలకంఠేశ్వర్, ఐసీఆర్‌పీలు, స్థానిక రైతులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఆ నిందలు తనపై పడకూడదని పవన్ దూరంగా ఉంటున్నారా?



**పాలకొల్లు. ప్రజాజ్యోతి సెప్టెంబర్ 7.** కూటమి ప్రభుత్వం లో మంత్రి లోకేష్ తప్పులు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తెలుసనని భవిష్యత్ లో ఆ నిందలు తనపై పడకూడదని అని బావిస్తూ ఏవేవో కారణాలు అంటూ అసెంబ్లీ సమావేశాలకు మరియు క్యాబినెట్ మీటింగ్ లకు ఎక్కువగా పవన్ కళ్యాణ్ హాజరు కావడం లేదని అనిపిస్తున్నదని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వర రావు అన్నారు.కాపులలో యూత్ ఫాయింగ్ ఎక్కువని ఆ పాలోవర్స్ లో అర్హులైన కొందరు డి. యస్. సి. .వ్రాసారని అయితే జరిగిన డి. యస్. సి. స్కామ్ కి ఆ కొందరు నిరాశావాదులు అయ్యేరని అన్నారు. వెన్నుపోటు ప్రభుత్వం అదికారంలోకి వచ్చి 30 నెలలు కావస్తున్నా ఇస్తాం అని చెప్పిన ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగ భృతి లేదని వారి వెన్నుపోటు ప్రభుత్వంలో చంద్రబాబు లోకేష్ తప్పులు చేస్తున్నారు అని అన్నారు. డియస్ సి లో జరిగిన అవకతవకలు రోజు రోజుకు వెలుగులోకి వస్తున్న సంఘటనలు చూస్తుంటే విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేసి సిబిఐ ఎంక్వరీ వేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాపు నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు అన్నారు.

## రైతుల సాగునీటి కష్టాలకు మురళీకృష్ణం రాజు చేయూత

--రూ.50 వేల ఆర్థిక సాయం..

--ఉచితంగా మోటారు ఏర్పాటు



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ పెద్దలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లారు.రైతుల సమస్యపై స్పందించిన ముదునూరి మురళీకృష్ణంరాజు తన వంతు సహాయంగా రూ.50 వేల చెక్కును అందజేశారు. అలాగే తన సొంత ఖర్చులతో ఒక మోటారును ఏర్పాటు చేసి, ధర్మవరం గ్రామ రైతులందరూ అవసరమైన సమయంలో ఉచితంగా మోటారును వినియోగించుకునేలా అందుబాటులో ఉంచాలని సూచించారు.సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆర్థిక సహాయంతో పాటు మోటారు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం పట్ల గ్రామ పెద్దలు, రైతులు ముదునూరి మురళీకృష్ణంరాజుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, మాజీ వైస్ సర్పంచ్ బొల్లు సీతారామరాజు, ఎంపీటీసీ జువ్వల సుజాత, బాబులు, మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ, జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో 'నవరస రాజరాజ రుచులు' రెస్టారెంట్ ప్రారంభం



**కాకినాడ రూరల్ (ప్రజా జ్యోతి)** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన "నవరస రాజ రాజ రుచులు" (క్షత్రియ ఫ్యామిలీ రెస్టారెంట్) ను ఎమ్మెల్యే పంతం నానాజీ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. జంపన రామరాజు ఆధ్వర్యంలో అచ్చంపేట జంక్షన్, రాయుడుపాలెం జంక్షన్ మధ్య ఈ రెస్టారెంట్‌ను రూపుదిద్దారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి సీనియర్ నాయకులు పిల్లి సత్తిబాబు మాట్లాడుతూ... పార్టీలో సీనియర్ నాయకుడైన రామరాజు ఆధ్వర్యంలో ఈ ఆధునిక రెస్టారెంట్ ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. వ్యాపారపరంగా ఇది మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.రెస్టారెంట్ నిర్వాహకులు జంపన రామరాజు మాట్లాడుతూ... తమ 'నవరస రాజరాజ రుచులు' రెస్టారెంట్‌లో కుటుంబ సమేతంగా విచ్చేసే కస్టమర్ల కోసం అన్ని రకాల అధునాతన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. రుచికరమైన, నాణ్యమైన వంటకాలను అందరికీ అందుబాటులో ఉండే ధరలకే అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పంతం నానాజీకి, టిడిపి సీనియర్ నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)కి మరియు ఇతర అతిథులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో కూటమి నాయకులు మాదారపు తాతాజీ, కర్రి వెంకట రాజు, తాటికాయల వీరబాబు, సోదే ముసలయ్య, రామిశెట్టి సునీల్, జీని శ్రీనివాస్, దెయ్యాల హరిబాబు, మాత లక్ష్మణ్, చొక్కా జగన్, పాండ్రంకి రాజు, సీతయ్య దొర, చెల్లపల్లి గణపతి, శేఖర్ రాజు, నరసింహ, రంజిత్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధురాలి పట్ల సీఐ తీరుపై ఎస్పీ సీరియస్

ఆదినారాయణపురం ఘటనపై సమగ్ర విచారణకు జిల్లా ఎస్పీ ఆదేశం




**బాపట్ల సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** చీరాల పట్టణం ఆదినారాయణపురంలో వృద్ధురాలి పట్ల సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుపై జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఐపీఎస్ తక్షణమే స్పందించారు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలపై ఆరా తీసిన ఎస్పీ, ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని చీరాల ఎస్‌డీపీవో ఎం.డి. మొయిన్‌ను ఆదేశించారు. సమగ్ర విచారణ అనంతరం నివేదిక ఆధారంగా తదుపరి శాఖపరమైన చర్యలు తీసుకోనున్నారు ఆదివారం చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదినారాయణపురంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు నాటుసారా తయారీ గంజాయి విక్రయాలు వినియోగానికి అడ్డుకట్ట వేయడంలో భాగంగా అనుమానితుల ఇళ్లు పరిసరాలను పరిశీలించారు ఈ క్రమంలో నాటుసారా, ఫోక్స్ కేసులలో నిందితులుగా ఉన్న పేరం విజయ్ కార్తీక్‌లకు చెందిన ఇంటి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు అక్కడ ఉన్న వృద్ధ మహిళ విజయ్ కార్తీక్‌ల గురించి తెలపకుండా తనిఖీలకు సహకరించలేదని సీఐ శశికుమార్ దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి వాటికి సంబందించిన వీడియోలు కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో విషయం పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి చేరింది.వైరల్ వీడియోలో కనిపిస్తున్న అంశాలు ఘటనకు దారితీసిన పరిస్థితులు పోలీసుల వ్యవహార తీరుపై విచారణలో పూర్తి స్థాయిలో పరిశీలించనున్నారు నివేదిక అందిన తర్వాత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

# మహిళా సాధికారతతోనే సమాజ ప్రగతి

## నెల్లిపాకలో పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ



మహిళా సాధికారతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు, మహిళలు



**ఎటపాక, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):** నేటి సమాజంలో మహిళల ప్రాముఖ్యతను గుర్తించి, వారికి సామాజిక, ఆర్థిక, చట్టపరమైన అంశాలతో పాటు మానసికంగా పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఎటపాక మండలం నెల్లిపాకలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.కన్నప్పరాజు, ఎటపాక ఎస్ఐ జి.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, బాలికల విద్య, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి బాలికకు ఉన్నత విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని సూచించారు. మహిళలు సొంతంగా ఉపాధి పొందడం, స్వయం సహాయక బృందాల ద్వారా లేదా చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వివరించారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళా సాధికారతకు కీలకమైన మెట్టుగా పేర్కొన్నారు. అనంతరం మహిళల హక్కులు, చట్టపరమైన రక్షణ, సమాజంలో మహిళల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెల్లిపాక జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో పాటు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ ప్రజలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు. మహిళా సాధికారతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందు కు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మహిళలు, గ్రామ ప్రజలు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళల సాధికారతే 'కూటమి' లక్ష్యం!

## గొల్లప్రోలులో టీడీపీ శ్రేణుల విస్తృత ప్రచారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు

## ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాల పంపిణీ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** మహిళల ఆర్థికాభివృద్ధి, సామాజిక సాధికారతే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేస్తోందని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు పేర్కొన్నారు. గొల్లప్రోలు పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి, ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారంతో కూడిన ప్రచార కరపత్రాలను వారికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గుండ్ర సుబ్బారావు మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మహిళా లోకం తీవ్ర ఇబ్బందులు పడిందని, అయితే నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం చూసేందుకే ప్రభుత్వం అనేక రకాల పథకాలను డిజైన్ చేసిందని, వాటిని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో చాలామంది మహిళలకు ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి పొందలేకపోతున్నారని ఈ గ్యాప్‌ను భర్తీ చేయడానికే టీడీపీ శ్రేణులు స్వచ్ఛందంగా రంగంలోకి దిగాయని సుబ్బారావు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క మహిళకూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటమే తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. పార్టీ ప్కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి, పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఏయే పత్రాలు అవసరమవుతాయి అనే విషయాలపై మహిళలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నదే తెలుగుదేశం పార్టీ ఆలోచన అని నేతలు స్పష్టం చేశారు. మహిళల రక్షణ, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయని, అలాంటి వాటిని నమ్మవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు పట్టణ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం





## సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్‌టియు నాయకులు......

**చాగలమర్రి , సెప్టెంబర్ 07( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే రాష్ట్రోపాధ్యాయ సంఘం లక్ష్యమని ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్, వెబ్సైట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నాగేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఎస్‌టియు మండల అధ్యక్షులు గురుచంద్రుడు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాహబూబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో చాగలమర్రి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల,కేజీబీవీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్,శంత పాలెం, ఎస్టీ కాలనీ పాఠశాలలతో పాటు మండలం లోని చిన్న వంగలి, చింతలచెరువు ఉన్నత,ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకుంటూ సభ్యత్వ నమోదు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ సురేషప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, రెండు డి.ఏ. లను ముఖ్యమంత్రి ఇచ్చే విధంగా సంఘాలు చేశాయన్నారు. పిఆర్‌సి,ఐఆర్ 30% ఇచ్చేవరకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే, సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు శేషాద్రి, నరసింహులు, కృష్ణశాస్త్రి, మహమ్మద్ గౌస్, నిరంజన్, షఫీరున్, కళ్యాణ్, హరిబాబు, నిరంజన్ బాబు, వెంకటేశ్వర్లు, వర్మ గారు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మౌలిక వసతులు కల్పించాలి

## ఎస్ఎఫ్ఐ డిమాండ్



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం, విద్యార్థులకు ఆటస్థలంతో పాటు అవసరమైన మౌలిక వసతులను వెంటనే కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ గొల్లప్రోలు మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'పాడా' పిడికి ఒక వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గొల్లప్రోలు మండల కార్యదర్శి బి. వడ్డీ కాసులు, కాకినాడ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె. సిద్ధు మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అనేక సంవత్సరాలుగా మౌలిక వసతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాశాలకు సొంత భవనం, ఆటస్థలం లేకపోవడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగడమే కాకుండా, క్రీడా కార్యకలాపాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తుచేశారు. పాడా అధికారులు తక్షణమే స్పందించి, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనాన్ని, ఆటస్థలాన్ని మంజూ రు చేసి విద్యార్థుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడు తుందని, అధికారులు త్వరగా స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా, డివిజన్, మండల స్థాయి ఫెడరేషన్ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# డిఎస్సీ అక్రమాల పై సిబిఐ విచారణకు ఆదేశించాలి

### కూటమి ప్రభుత్వం బండారం బట్టబయలు

### రోజుకోక అవినీతి నియామకం బయట పడుతున్నా నోరెత్తని ప్రభుత్వ పెద్దలు

### భారీ అక్రమాల డిఎస్సీ పై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ మౌనం వీడాలి



**కాకినాడ సెప్టెంబర్ 7 : (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో జరిగిన అతి పెద్ద ఉద్యోగ నియామకాల స్కామ్ పై ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేసారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందు నుంచి డిఎస్సీ అక్రమాలపై పోరాటం చేస్తుందన్నారు. ఇటీవల కొన్ని మీడియా ఛానళ్లు ఆధారాలతో సహా అక్రమాల పుట్టను వెలికితీయడంతో వాస్తవాలేంటో ప్రజలకు స్పష్టం అవుతోందన్నారు. తాజాగా కాకినాడ జిల్లాలో వెలుగు చూసిన తప్పుడు కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగార్హత సాధించిన అంశం విస్మయానికి గురిచేస్తుందన్నారు. ఉద్యోగం కోసమే కులం మార్చుకున్న పెద్దాపురం నకు చెందిన సక్కు లక్ష్మీ సునీత బిసి-బి నుంచి బిసి-ఈ క్యాటగిరీలోకి మార్చుకుని కాట్రేనికోన మండలం కందికుప్పులో తెలుగు టీచర్‌గా ఉద్యోగం పొందారని తెలిపారు. అవ్యవహారంపై షేక్ అమీ రుద్దీన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులు ఇప్పటికీ ఆమె సర్టిఫికెట్లను పరిశీలించకపోవడానికి కారణాలేం టని ప్రశ్నించారు. అక్రమాల పుట్టగా ఉన్న డిఎస్సీ నియామ కాలపై అధికారుల పాత్ర ఉందన్న అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. కర్నూలు జిల్లాలో ప్రభాకర్ మొదలు, శ్రీకాకుళం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు రావడం వెనుక కూటమి ప్రభుత్వం అవినీతి ఉందన్నారు. అర్హత లేని వారిని అడ్డదారుల్లో నియామిస్తే విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందన్నారు. వాస్తవాలను బహిర్గతం చేస్తోన్న మీడియాపై ఆంక్షలు విధించేందుకు సైతం కూటమి ప్రభుత్వం వెనుకాడటం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో అక్రమ నియామకాలపై మరిన్ని ఆధారాలు బయటపడతాయన్నారు. ఈ అంశంపై పై గతంలో ప్రభుత్వాధికారులతో వివరణ ఇచ్చారని, ఇప్పుడు అధికారులు సైతం వివరణ ఇచ్చేందుకు వెనుకాడుతున్నారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్ని నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ఉన్న విచారణ సంస్థలతో విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం లేనందున సిబిఐ విచారణ జరిపించాలన్నారు. స్పోర్ట్స్ అకాడమీలు, అసోసియేషన్ ఇచ్చే సర్టిఫికెట్లు ఏ విధంగా ఉద్యోగార్హతకు ప్రామాణికం అనేది స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిఎస్సీ పై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నిస్తానని రాజకీయాల్లో వచ్చిన పవన్ కళ్యాణ్ ఇంత జరుగుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నార న్నారు. విద్యార్థుల భవిష్యత్తు, అర్హత ఉన్న నిరుద్యోగులకు సంబంధించిన ఈ వ్యవహారం పై పవన్ కళ్యాణ్ మౌనం వీడాలన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు రోడ్డెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసు ఉద్యోగ భర్తీపై కల్లబొల్లి వాగ్ధానాలు చేసిన ఇప్పుడు తూతూ మంత్రంగా నోటిఫికేషన్ ఇవ్వడం వారిని మోసం చేయడమేనన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్న అనుభవిస్తూ వారినే మోసం చేయడం తగదన్నారు.

# ఘనంగా ప్రజాప్రతినిధుల సన్మానం

### శాలువాలు, పూలదండలతో ఎంపీపీ, జెడ్పీటీసీ ఎంపీటీసీలకు ఘన సత్కారం

### కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవ తీర్మానం





**కూనవరం, సెప్టెంబర్ 7: ప్రజా జ్యోతి** కూనవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు, మండల అభివృద్ధికి వారు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ శాలువాలు కప్పి, పూలదండలు వేసి ఆత్మీయంగా సత్కరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, వారి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సభ్యులు చేసిన కృషిని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని తీవ్ర వర్షాభావ పరిస్థితులపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

# ఏలేశ్వరంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన





### ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో

### రూ.40 లక్షల శ్రీవాణి నిధులతో ఆలయ నిర్మాణం

**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మున్సిపాలిటీలో రూ.40 లక్షల శ్రీవాణి నిధులతో నూతనంగా నిర్మించనున్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, పట్టణ టీడీపీ నాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వేదిక సురేష్ దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. వేదమంత్రాలతో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు 'వాసవి మాతకు జై' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీవాణి నిధుల ద్వారా రూ.40 లక్షలు మంజూరయ్యేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వాసవి సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలేశ్వరం ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు వాగు రాజేష్, వాగు గున్నబాబు, పాబోలు రత్తయ్య, రుచి రమేష్, ఎండగుడి నాగబాబు, బుగత శ్రీను, మణికంఠ, రాకేష్, వాసవి సేవా సంఘ సభ్యులు ప్రగళ్లపాటి కామేష్, అనంతపల్లి శ్రీను, గొల్లపూడి త్రిమూర్తులు, రాతిక్రింది సతీష్, మామిడిపాక సతీష్, కాపగంటి మోహన్, వాగు బద్రిస్, వాగు బలరాం, వాగు రమేష్, దేవకి లక్ష్మీనారాయణ, పాబోలు రాజా, పిరాట్ల విస్సు, రవి, పిరాట్ల రాజా తదితర సంఘ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభం నుండి ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

### సి రంగయ్య.



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ పోలీసులకు రావాల్సిన దాదాపు 223 కోట్ల అడిషనల్ సరెండర్ లీవ్ అలవెన్సు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, ఇతర అలవెన్సులను చెల్లించి పోలీసు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లాలని మీడియాను కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సోషల్ మీడియా ద్వారా ప్రచారం, అవసరమైతే ఉద్యమ కార్యాచరణ చేపడతామని రంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు పాల్గొన్నారు

## కొత్తతరహా చిరు వ్యాపారాల వైపు యువత!..

### యువతమంచిమార్గంలో ఉండాలంటే!..

### కష్టాన్ని నమ్ముకోవాలి!..యర్రం ప్రశాంత్!..



**వి.ఆర్.పురం, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** కాలం కలిచొచ్చి,ఆలోచనలకు మంచిపదును పెడితే వ్యాపారం అద్భుతాలు, సృష్టించబడతాయని, యువత మంచిమార్గంలో నడిచేందుకు ఉదాహరణ ఈ20 ఏళ్లకుర్రాడు యర్రం ప్రశాంత్, చేసి చూపిస్తున్నాడు. చదువుకోవడం మంచిదే ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాన్ని కూడా నమ్మాలి అనే "ఓకే"ఒక కాన్సెప్ట్ ఈకుర్రాడిని చూసి నేర్చుకోవాలి, తల్లీకిఅండగా ఉంటూ తన తమ్ముడిని చదివిస్తూ, స్వయం కృషినే నమ్ముకున్న ఈకుర్రాడు ప్రతీ ఒక్కరికీఆదర్శం.అందరితో కలుపుగోలుగా మాటకు డుతూ తల్లీకి అండగా, సహాయంగా ఉంటూ కొత్త,కొత్త, చిన్నతరహా, చిరువ్యాపారాన్ని పట్టణాల్లో ఉన్న ఈ వ్యాపారాన్ని, గ్రామాలకు పరిచయం చేస్తూ చికెన్, చీకులను వరరా మచంద్రాపురం, మండలానికి పరిచయం చేసిన ఈకుర్రాడి నిర్ణయాన్ని అందరూ అభినందించాల్సిందే, ఈ 20 ఏళ్ల యర్రం ప్రశాంత్, నిర్ణయాన్ని అద్భుతం మనే చెప్పాలి.ఈ కుర్రాడి వ్యాపారం అంచెలంచెలుగా వృద్ధిలోకి రావాలని కోరుకుందాం. యర్రం ప్రశాంత్ ని అభినందిద్దాం.

## ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన

--"డ్రగ్స్ వద్దు బ్రో" నినాదాలతో విద్యార్థినుల ప్రతిజ్ఞ

--ప్రిన్సిపాల్ శారద ఆధ్వర్యంలో ఈగల్ టీం చేపట్టిన కార్యక్రమం



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరంలోని ఆంధ్రప్రదేశ్ బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రిన్సిపల్ శారద ఆధ్వర్యంలో ఈగల్ బృందం చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులతో "డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ నినాదాలు చేయించారు.ఈ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల కలిగే శారీరక, మానసిక, విద్యాపరమైన, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థినులకు వివరించారు.చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ శారద, ఈగల్ బృందం సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు

## రాచపల్లిలో భారీ అన్న సమారాధన కార్యక్రమం



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని గ్రామంలోని ద్వారక నగర్,నంది వీధి ఆలయ ప్రాంతంలో సోమవారం శ్రీకృష్ణ యాదవ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నైదాన రఘు బర్ల లోవరాజు, కోన గంగాధర్, శ్రీకృష్ణ యాదవ్ ఆలయ కమిటీ ప్రతినిధులు గింజాల బాబారాందేవ్ యాదవ్, ఇసరపు సత్యనారాయణ, రామాల వీరబాబు, గింజాల సుబ్రమణ్యం, బొట్టా అప్పలరాజు, గింజాల శివాజీ, గింజాల చిట్టిబాబు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఒకగొప్పమనస్సున్న వ్యక్తి ని కోల్పోయాం!..

### కాపారపు ఉమా మహేశ్వరరావు మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరనిలోటు!..




**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** మంచి మనసున్న మహానుభావుడు అందరికీ ఆదర్శవంతుడు, ఏజెన్సీలో ప్రతీ ఒక్కరికీ సహాయకారి,కాపారపు ఉమామహేశ్వరరావు, హఠాత్మరణం మండల ప్రజలను కలిచివేసింది. కుటుంబ సభ్యులకు తీరనిదుఃఖాన్ని మిగిల్సింది. మండలకేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. కాపారపు ఉమామహేశ్వరరావు, ఈ ప్రాంతంలో పెద్దవ్యవసాయ రైతుగా,వై.సి.పి,పార్టీ నాయకులుగా అందరికీ చుపరిసితులు. వడ్డీ కమ్యూనిటీలో బలమైన నాయకులుగా గుర్తింపు పొందారు. కాపారపు ఉమామహేశ్వరరావు, మరణంతో ఆయన స్వగ్రామం సీతంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఏది ఏమైనా !ఒకమంచి వ్యక్తిని గొప్పనాయకుణ్ణి కోల్పోయాం.

# స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలి

## -మండల బిజెపి కార్యవర్గ సమావేశంలో శరకణం రాజుబాబు.

**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. మండల బిజెపి కార్యవర్గ సమావేశం మండల కేంద్రమైన కిర్లంపూడి ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు.రాష్ట్ర బిజెపి అధ్యక్షులు, పివిఎన్ మాధవ్ ఆదేశాలతో , కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు సూచన మేరకు, జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి కుండల సాయి కుమార్ యాదవ్ కిర్లంపూడి మండలం ఇన్చార్జి భీమ్ శంకర్ ఆలోచనలకు అనుగుణంగా,కిర్లంపూడి మండల అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.ప్రదానంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. సెప్టెంబర్ 17 తారీఖున భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు జరుపుకునే జయంతి ఉత్సవాలు గురించి,బూత్ స్థాయి నుండి పార్టీ ని బలోపేతం చేయడమే కాకుండా,కొత్తవారిని జాయిన్ చేసుకోవడం గురించి చర్చించారు. ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్నవారు ముందుగా తనకు తెలియజేస్తే పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని శరకణం రాజబాబు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కంటా కాశీ విశ్వనాథం, కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఐవివి సత్యనారాయణమూర్తి, కిర్లంపూడి మండల ప్రధాన కార్యదర్శిలు కోనేటి శ్రీనివాసరావు, మిరియాల వెంకటేష్ మండల ఉపాధ్యక్షులు కొప్పిశెట్టి జగదీష్, పెదగాడ లోవరాజు, ఇసరపు శివబాబు, జ్యోతుల దుర్గ ప్రసాద్, బోనగిరి కాశీ విశ్వనాథం మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ మండల ఓబిసి ప్రధాన కార్యదర్శి నైదాన రవి, మండల కార్యదర్శిలు కోలా కృష్ణ, దొడ్డారామచంద్ర రావు గారు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు సుభాకర్, మండల కోశాధికారి బుర్రి విజయకుమార్,మండల యువమోర్చా ప్రధాన కార్యదర్శి యువరాజు,పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ వాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల కరపత్ర ఆవిష్కరణ







**చాగలమర్రి , సెప్టెంబర్ 07( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణములో శ్రీ వినాయక చవితి పర్వదిన ఉత్సవాల కరపత్ర ఆవిష్కరణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు.శ్రీ వాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించే వినాయకచవితి పండుగ సందర్భంగా అధ్యక్షుడు తొమ్మంద్రు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే విధంగా వినాయక చవితి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక రామాలయంలో నిర్వహించారు.తొమ్మంద్రు వినోద్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ కమిటీ సభ్యులు శ్రీ వాసవి యువజన సంఘం అధ్యక్షుడు తొమ్మంద్రు వినోద్ కుమార్ ఉపాధ్యక్షులు కామిశెట్టి మధుసూదన్ రావు అయినాల శ్రీనివాసులు బచ్చు సుగుణాకర్ ,కార్యదర్శులు బింగుమళ్ళ హరికృష్ణ తలుపుల సునీల్ కుమార్ ఉప కార్యదర్శులు వల్లంకొండు సాయి సుదర్శన్ రావు వందవాసి శివ సుబ్బ చక్రధర్ ఉప కోశాధికారి కామిశెట్టి సుబ్రమణ్యం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు నియోజకవర్గాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలి




**గోపవరం సెప్టెంబర్ 7 ప్రజా జ్యోతి న్యూస్.........**ఎల్ నినో ప్రభావంతో ఏడాది వర్షాలు లేక కరువుతో అల్లాడుతున్న బద్వేలు నియోజకవర్గ మండలాలను తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీని ఇచ్చి ఆదుకోవాలని, ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వమే తక్కువ ధరలకు పంపిణీ చేసి ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, బద్వేల్ నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ఆ పార్టీ నాయకులతో కలిసి బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ నందు గల వారి పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్, పి.చంద్రమోహన్ సంయుక్తంగా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో ఏడాది వర్షాలు లేని కారణంగా వ్యవసాయ రంగం కుదేలైపోయిందని, రైతాంగం పూర్తి సంక్షోభంలోకి వెళ్లారని, ఈ క్రమంలో రైతులకు బాగా పెట్టుబడి పెరిగిపోయి రాబడి తగ్గి ఆర్థికంగా వెనకబడి పోతున్నారని తక్షణమే కరువు సహాయక ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి ప్రతి ఎకరాకు తగిన కరువు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు పంటల భీమా, ఇన్పుట్ సబ్సిడీ, పెండింగ్లో ఉన్న సున్నా వడ్డీ బకాయిలను తక్షణమే చెల్లించి ఆదుకోవాలని కోరారు. అదిగో వస్తున్నాయి జగన్నాథ రథచక్రాలు అన్న చందంగా ఇటు బ్రహ్మ సాగర్ అటు వెలుగోడు ప్రాజెక్టు నీళ్లతో కడప జిల్లాను సస్యశ్యామలం చేస్తామని సినిమాటోగ్రఫీ లాగా ప్రసారమాధ్యం లో డబ్బాలు కొడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమీ లేదని వారు మండిపడ్డారు. మరోవైపు నిత్యవసర వస్తువులు ధరలు అమాంతం పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయని పేద మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షలా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టమోటో, ఉల్లిగడ్డ, చక్కెర,వంట నూనె లాంటి నిత్యవసర వస్తువులు అందనంత దూరంలో ఉండి పేద మధ్యతరగతి ప్రజలను వెక్కిరిస్తున్నాయని దీనికంతటికి ప్రభుత్వ నిర్లక్ష్యం, బ్లాక్ మార్కెట్లో అక్రమ నిల్వలు ఉండడమే ప్రధాన కారణమని వారు దుయ్యబట్టారు. తక్షణమే రేషన్ షాపులలో మరియు మార్కెట్ యార్డుల్లో ప్రత్యేకంగా నిత్యవసర వస్తువులను ప్రభుత్వమే సబ్సిడీ ధరలతో ప్రజలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రస్తుతం రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్ లేకప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**పెండింగ్లో ఎన్నో సమస్యలు**

**స్వర్ణ గ్రామం చుట్టూ ప్రజల ప్రదక్షిణలు**

**వెంటనే రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్ నియమించాలని ప్రజల డిమాండ్**

**ప్రజాజ్యోతి ప్యాపిలి :** మండల కేంద్రంలోని కలచట్ల స్వర్ణ గ్రామ కార్యాలయంలో రెగ్యులర్ డి ఏ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన ఫించన్ మరియు సంబంధిత పనుల కోసం స్వర్ణ గ్రామ కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, భూములకుసంబంధించిన సమస్యలు, వ్యవహారాల కోసం ప్రజలు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పలు పనులు ఆలస్యమవుతున్నా యని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పూర్తిస్థాయి అధికారి అందుబాటులో ఉంటేనే ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.10 నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు,పాలకులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించికల చెట్ల గ్రామానికి వెంటనే రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్ ని నియమించాలని ప్యాపిలి మండల ఎంపీడీవో గారికి కలచట్ల గ్రామ ప్రజలు విన్నవించుకోవడం జరుగుతుంది.




## కురసాల కన్నబాబు తండ్రి సంవత్సరికం లో కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర అధికార



**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్ పతినిధి ముదునూరి మురళీరాజు** కాకినాడ వైద్య నగర్ రమణయ్యపేట లో జరుగుచున్న కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ మరియు విశాఖ--విజయనగరం రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు గారి తండ్రి కురసాల సత్యనారాయణ సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులర్పించి కురసాల కన్నబాబు గారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి పలికి వారి పవిత్ర ఆత్మకు చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించిన ఉభయ గోదావరి జిల్లాలు రీజినల్ కో-ఆర్డినేటర్,శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ,మాజీ మంత్రివర్యులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ లిశ్రీ గుడివాడ అమర్నాథ్ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు తుని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ దాడిశెట్టి రాజా గారు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ముదునూరి మురళికృష్ణం రాజు మాజీ కాకినాడ ఎంపీ,పిఠాపురం నియోజవర్గం ఇంచార్జ్ శ్రీ వంగా గీతా విశ్వనాథ్ ,పెద్దాపురం నియోజవర్గం ఇంచార్జ్ లిదవులూరి దొరబాబు జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు రామచంద్రపురం నియోజవర్గం ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,జువ్వల దొరబాబు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అమరావతిలో టీడీపీ లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే సత్యప్రభ



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** అమరావతిలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు,నియోజకవర్గ నాయకుల కోసం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్ కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. ఇంటరాక్టివ్ విధానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వర్క్‌షాప్‌లో నాయకత్వ నైపుణ్యాల పెంపు, ప్రజలతో మరింత సమర్థవంతమైన అనుసంధానం, పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర తదితర అంశాలపై చర్చలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహచర శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యుల రైజేషన్ కోసం నిరసన



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు పామిడి:** వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజేషన్ జరిగేంతవరకు వారికి 100 శాతం గ్రాస్ గ్లాసెస్ వేతనం కల్పించాలని, అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు అందుతున్న వారిగానే ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సామాజిక ఆరోగ్య కేంద్రం సి. హెచ్. సి పామిడిలో వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, తమకు ఉద్యోగ భద్రత, సమాన వేతనం, ఇతర సంక్షేమ సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, అప్పటివరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, గ్రాస్ మరియు ఇతర సదుపాయాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో అనంతపురము జిల్లా మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకృష్ణ, తేజస్విని, సత్యాంజనేయులు, కవితమ్మ తదితర కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. “కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది” అని వారు స్పష్టం చేశారు.

## ఆదర్శ రైతు,నిరాడంబరుడు కాపరపు ఉమామహేశ్వరరావు కు మండలంమొత్తం ఘనంగా కన్నీటి నివాళ్ళర్పిస్తుంది!..



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** సీతంపేట గ్రామం ఒకమంచి మనిషిని, మృదు స్వభావిని కోల్పోయింది. గ్రామానికి చెందిన ప్రముఖరైతు, నిబద్ధత కలిగిన వ్యక్తిగా కాపరపు ఉమామహేశ్వర రావు, గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పొలంబాటలో కష్టాన్ని నమ్ముకున్న ఆదర్శ రైతుగా మాత్రమేకాకుండా, అందరితో ఎంతో నెమ్మదిగా, మర్యాదగా మాట్లాడే ఆయన సాధుస్వభావం,మృదుస్వ భావి, సీతంపేట గ్రామ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసింది. ఎంతటి సమస్య వచ్చినా చెదరని చిరునవ్వుతో, నెమ్మదైన మాటలతో ఎదుటి వారి మనస్సులను గెలుచుకోవడం ఆయనకే చెల్లింది. రాజకీయంఏదైనా, గ్రామంలో మనుషుల అనుబంధాలకే ఆయన మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు.? ఆయన మరణం సీతంపేట గ్రామానికి, వరరామచంద్రాపురం, మండలానికి, ఆయన కుటుంబానికి మరియు శ్రేయోభిలాషులకు తీరనిలోటు. ఆయన ఆత్మకుశాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు గాఢ సానుభూతి. తెలిజేస్తూ...!

# ప్రజాభిమానం మధ్య గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ జన్మదిన వేడుకలు





**పోలీస్ స్టేషన్‌కు వెల్లువెత్తిన యువత, గ్రామస్థులు**
**శాంతిభద్రతల రక్షకుడిపై కురిసిన పూలవానకేకులు**
**కట్ చేసి, దుశ్శాలువాలతో సత్కరించిన అభిమానులు**

**గొల్లప్రోలు, (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండల ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆదర్శ పోలీస్ అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ నౌడు రామకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తూ, సామాన్య ప్రజలకు సైతం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఎస్సై రామకృష్ణపై స్థానికులు తమకున్న అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు. పుట్టినరోజును పురస్కరించుకుని మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి యువకులు, పెద్దలు, గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఆయన చూపిస్తున్న చొరవను, ప్రజల పట్ల ఆయనకున్న సుహృద్భావాన్ని కొనియాడారు. అభిమానులు ఎస్సైకి పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల యువకులు ఎస్సై రామకృష్ణపై తమకున్న అభిమానానికి ప్రతీకగా ప్రత్యేకంగా భారీ కేకులను తీసుకువచ్చారు. రామకృష్ణ కేక్ కట్ చేసి, అక్కడికి వచ్చిన వారందరికీ తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వేదికగా జరిగింది. రాజకీయ శ్రేణులు, ప్రముఖుల అభినందనలు ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న ఎస్సై రామకృష్ణను అభినందించేందుకు పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా తరలివచ్చారు. ఆయనకు బొకేలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలుస్తున్న రామకృష్ణ లాంటి అధికారి గొల్లప్రోలుకు దొరకడం గర్వకారణమని ఈ సందర్భంగా పలువురు పెద్దలు కొనియాడారు. ఈ అద్భుతమైన వేడుకల్లో గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు, మండలంలోని వివిధ గ్రామాల ప్రముఖులు, యువకులు, అభిమానులు పాల్గొని ఎస్సై రామకృష్ణకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# మన ప్రాంతానికిమన నీళ్లు డ్యామ్‌కు నీరు రావాలి హెచ్ ఎల్ సి దిగువ ఆయకట్టుకు నీరు చేరాలి

**రైతులతో కలిసి కలెక్టర్ గారికి వినతి పత్రం సమర్పించిన డాక్టర్ సాకే శైలజనాథ్.**

**సెప్టెంబర్ 7 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు:-**అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని హెచ్ ఎల్ సి కాలువల దిగువ ఆయకట్టు ప్రాంతాలకు మరియు తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ అలాగే సుబ్బరాయ సాగర్ కు తక్షణం సాగునీరు విడుదల చేసి, రైతులు మరియు ప్రజల నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు నాయకులతో కలిసి ఎండిన పంటల చేత పట్టుకొని కలెక్టర్ గారికి వినతి పత్రం సమర్పించిన నియోజకవర్గం సమన్వయ కర్త డాక్టర్ సాకే శైలజనాథ్ గారు. ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ గారు మాట్లాడుతూ.. హెచ్ఎల్సీ నీరు ఎం.పి.ఆర్. డ్యాం దక్షిణ కాలువ ద్వారా ప్రతి సంవత్సరం ఆయకట్టు ప్రాంత రైతులకు హక్కుగా అందుతున్న విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం హెచ్ఎల్సీ దిగువ ప్రాంతంలోని శింగనమల నియోజకవర్గానికి నీరు అందించేందుకు వీలు లేదని ఐఏబీ సమావేశంలో నిర్ణయించడం పట్ల రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. హెచ్ఎల్సీ నీరు కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం కాదు. ఇది వేలాది మంది రైతుల జీవనాధారం. ఇది రాజకీయ అంశం కాదు..రైతు బతుకు సమస్య. ఐఏబీ సమావేశంలో కనేకల్లు చెరువు, హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టుకు మాత్రమే నీరు అందిస్తామని, ఎం.పి.ఆర్. మరియు పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు ప్రాంతాలకు, అలాగే సంబంధిత చెరువులకు నీరు ఇవ్వడం లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది అన్నారు. ఈ పరిస్థితుల్లో హెచ్ఎల్సీ దిగువన, ఎం.పి.ఆర్. డ్యాం పరిధిలోని శింగనమల, తాడిపత్రి తదితర నియోజకవర్గాల రైతుల పరిస్థితి ఏమిటి? వారికి నీరు ఎందుకు అందించకూడదు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం సెప్టెంబర్ నెలలోకి ప్రవేశించినప్పటికీ తగిన వర్షాలు లేకపోవడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. బోర్లు ఎండిపోతున్నాయి, మెట్ట భూముల్లో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సాగులో ఉన్న పండ్ల తోటలకు కూడా భూగర్భ జలాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులను చూస్తున్నాం అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో రైతులు కన్నబిడ్డల్లా పెంచుకున్న పండ్ల తోటలను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు సుమారు రూ.900 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది ఒక్కరోజు లేదా ఒక్కసారి చేసే ఖర్చు కాదు. పంట చేతికొచ్చే వరకు నిరంతరం ఈ భారాన్ని భరించడం రైతులకు ఆర్థికంగా అసాధ్యం అన్నారు. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రజలు, పశువులకు కూడా తాగునీటి సమస్య తీవ్రతరమవుతోంది. ఇంతటి నీటి సంక్షోభం కళ్లముందు కనిపిస్తున్నప్పటికీ నీరు అందించలేమని చెప్పడం రైతుల పట్ల బాధ్యతారాహిత్యంగా మారుతుంది.





నీటిని విడుదల చేయడం సాధ్యం కాకపోతే, రైతుల పంటలు మరియు పండ్ల తోటలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకోబోయే ప్రత్యామ్నాయ చర్యలను స్పష్టంగా ప్రకటించాలి కోరారు. అదేవిధంగా, శ్రీశైలం నుంచి ప్రతిరోజూ సుమారు నాలుగు టీఎంసీల నీరు దిగువకు విడుదలవుతున్న పరిస్థితుల్లో, అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని హెచ్ఎల్సీ చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. హెచ్ఎల్సీ ఎగువ ప్రాంతంలోని కర్ణాటక పరిధిలో ఆరుతడి పంటలకు 90 రోజులపాటు నీరు అందించే అవకాశం ఉన్నప్పుడు, అదే హెచ్ఎల్సీ దిగువ ప్రాంతంలోని రైతులకు నీరు ఎందుకు అందించకూడదో ప్రభుత్వం స్పష్టం చేయాలి. అలాగే జీవో నంబర్ 3 ప్రకారం ఎల్ఎల్సీ నుంచి కనీసం 5 టీఎంసీల నీటిని అనంతపురం జిల్లాకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో సమీక్షించాలి అన్నారు. తుంగభద్రలో నీటి లభ్యత ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, తుంగభద్ర బోర్డు నిర్ణయించిన కేటాయింపులకు అదనంగా అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే అవకాశాలను కూడా పరిశీలించి, హెచ్ఎల్సీ చివరి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. రైతు పంట వేయలేకపోయినా, వేసిన పంట ఎండిపోయినా అది రైతు తప్పు కాదు. నీటిని సకాలంలో అందించాల్సిన వ్యవస్థ వైఫల్యం కదా అని అన్నారు. కావున, గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారు ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి:

1. శింగనమల నియోజకవర్గానికి రావాల్సిన న్యాయ నీటిని సక్రమంగా, న్యాయబద్ధంగా అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.
2. హెచ్ ఎల్ సి కాలువల దిగువ ప్రాంతాల్లోని ఆయకట్టు భూములకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలి.
3. ఎం పీ ఆర్ డ్యామ్‌కు సంబంధించిన నీటి లభ్యత, నిల్వలు, విడుదల మరియు ఆయకట్టు పరిస్థితిపై జిల్లా అధికారులతో తక్షణ సమీక్ష నిర్వహించాలి.
4. నీటి పంపిణీలో ఎక్కడైనా అంతరాయం లేదా అన్యాయమైన మళ్లింపులు ఉంటే వాటిని పరిశీలించి, న్యాయమైన నీటి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలి.
5. నీటి కొరతతో ఎండిపోతున్న చీని మరియు ఇతర ఉద్యాన పంటలను కాపాడేందుకు అత్యవసర నీటి సరఫరా, ట్యాంకర్ సదుపాయం లేదా ఇతర ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.
6. శింగనమల నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలి.
7. పశువులకు తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.
8. శింగనమల నియోజకవర్గంలోని రైతులు, ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, నీటి సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి.
9. ప్రస్తుతం నీటి లభ్యత, కాలువల పరిస్థితి, ఆయకట్టు పరిధి, నీటి విడుదల వివరాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. ఇది రాజకీయ ఉద్దేశంతో చేస్తున్న డిమాండ్ కాదు. ఇది రైతు బతుకు కోసం చేస్తున్న విజ్ఞప్తి..

ఇది ప్రజల తాగునీటి కోసం చేస్తున్న విజ్ఞప్తి..ఇది పశువుల ప్రాణాలను కాపాడేందుకు చేస్తున్న విజ్ఞప్తి..ఇది శింగనమల ప్రాంత భవిష్యత్తు కోసం చేస్తున్న విజ్ఞప్తి. నీరు ఉన్న చోటికి నీరు వెళ్తున్నప్పుడు, నీటి కోసం ఎదురుచూస్తున్న శింగనమల రైతులకు కూడా న్యాయం జరగాలి. రైతు పంట వేయలేకపోతే అది రైతు తప్పు కాదు. రైతుకు అవసరమైన సమయంలో నీరు అందకపోవడం వ్యవస్థ వైఫల్యం అన్నారు. రైతుల జీవనాధారమైన సాగునీటి విషయంలో తక్షణ నిర్ణయం తీసుకుని, శింగనమల నియోజకవర్గ రైతులు, పంటలు, పండ్ల తోటలు మరియు ప్రజల తాగునీటి అవసరాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము. నీరు రైతు హక్కు..రైతు బతుకు ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణ రెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ విభాగం రాష్ట్ర నాయకులు బొమ్మన శ్రీరామ్ రెడ్డి, వంశీ గోకుల రెడ్డి, బోగాతి ప్రతాపరెడ్డి, సరిబాల ప్రతాప్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, ఎల్లారెడ్డి, పరంధామ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, అంకె ముసలన్న, గువ్వల శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మంజునాథ్, పద్మావతి, బోనాల హరికృష్ణ, ఓబిరెడ్డి, కాటమయ్య, ఆంజనేయులు, నాగలింగారెడ్డి, పుల్లారెడ్డి, కొండ్రెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఫణీంద్ర, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇషాన్ రికార్డు డబుల్ సెంచరీ.. ఎట్టకేలకు ఈస్ట్ జోన్ ఆలౌట్..!

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్(270) రికార్డు ద్విశతకంతో రెచ్చిపోయాడు. తొలి రోజే సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించిన ఇషాన్.. రెండో రోజూ విధ్వంసాన్ని కొనసాగించాడు. కుమార కుషగ్ర (101)తో రెండొందలకు పైగా భాగస్వామ్యం నెలకొల్పాడు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), శిఖర్ మోహన్(85)లు కూడా దంచేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ 708 పరుగులు వద్ద ఆలౌటైంది. దులీప్ ట్రోఫీ టైటిల్ పోరులో ఈస్ట్ జోన్ జట్టు భారీ స్కోర్ కొట్టింది. తొలిరోజే సౌత్ జోన్ బౌలర్లను వణికిస్తూ ఇషాన్ కిషన్(270: 334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు) మరింత భయపెట్టాడు. తొలి రోజే సెంచరీతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పదోసారి మూడంకెల స్కోరందుకున్న ఇషాన్.. రెండో రోజూ రెచ్చిపోయాడు. ఓవర్‌నైట్ స్కోర్ 385/4తో ఆట మొదలెట్టిన జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. సౌత్ బౌలర్ల వ్యూహాలను చిత్తు చేసిన ఈ చిచ్చరపిడుగు.. కుమార కుషగ్ర(101)తో కలిసి స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఈ క్రమంలోనే దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ సాధించాడు ఇషాన్. తద్వారా టైటిల్ పోరులో ద్విశతకం బాదిన ఐదో ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు.

**తొలిరోజు 385/4**

చిదంబరం స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ చెలరేగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జట్టుకు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44)లు శుభారంభమిచ్చారు. సిరాజ్, మిలింద్ వంటి బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న వైభవ్ తొలి వికెట్‌కు వంద రన్స్ జోడించాడు. వైభవ్ అర్ధ శతకం చేజార్చుకోగా.. ఈశ్వరన్ ఫిఫ్టీతో మెరిశాడు. ఆపై శిఖర్ మోహన్(85) ధనాధన్ ఆడాడు. లంచ్ తర్వాత నుంచి ఇషాన్, కుషగ్రలు సౌత్ బౌలర్లను విసిగిస్తూ క్రీజులో పాతుకుపోగా తొలి రోజు ఆట ముగిసే సరికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసిన విషయం తెలిసిందే.



# క్రీడల్లో సత్తా చాటిన మహిళా కానిస్టేబుల్ సంధ్య అభినందించిన డిఎస్పీ శ్రీహరిరాజు



**తూర్పుగోదావరి జిల్లా సెప్టెంబర్ 7( ప్రజా జ్యోతి ప్రతినిధి)** విజయవాడలోని వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు నిర్వహించిన తొలి ఏపీ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ డబ్ల్యూపీసీ-1332 ఆర్ సంధ్య అద్భుత ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. హ్యాండ్‌బాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం, వాలీబాల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, ఆర్మ్ రెజ్లింగ్‌లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి పోలీస్ శాఖకు వన్నె తీసుకొచ్చిన సంధ్యను రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ డి శ్రీహరి రాజు, ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి, తోటి సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కోపరేటివ్ సొసైటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చెయ్యాలి.

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి పద్మారావు.**



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 7.** కోపరేటివ్ సొసైటీ అభివృద్ధికి పాలకవర్గం తగిన కృషి చెయ్యాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి పద్మారావు సూచించారు. పోడూరు. మండలం వేడంగి పాలెం కోపరేటివ్ సొసైటీకి నూతనం గా నియమితులైన త్రి సభ్య పాలకవర్గం ప్రమాణ స్వీకారం సొసైటీ కార్యాలయం లో సోమవారం జరిగింది. అసిస్టెంట్ రిజిస్ట్రర్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించగా సొసైటీ చైర్మన్ గా లంకలపల్లి రవీంద్ర ప్రసాద్ పాలకవర్గ సభ్యులుగా కొండేటి నాగ దుర్గాప్రసాద్ గుడాల శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. ఇన్చార్జి సెక్రెటరీ పి రామకృష్ణ టిడిపి జనసేన బిజెపి నాయకులు గ్రామ పెద్దలు సొసైటీ సిబ్బంది ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి.

**ఆలమూరు పోలీసులు కేసు నమోదు.**

ఎస్సై జి. నరేష్



**ఆలమూరు సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి):** మండపేట నుంచి మార్టేరు వైపు వెళ్తుండగా ఆలమూరు వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలపాలై ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఆలమూరు ఎస్సై జి నరేష్ తెలిపారు.

**ఘటన వివరాలు:**

పాలకొల్లు మండలానికి చెందిన వంగా ఏసురాజు (41) అనే వ్యక్తి ప్రస్తుతం మండపేటలో నివాసముంటున్నాడు. ఆటో రిపేర్ పనుల నిమిత్తం ఆయన మండపేట నుంచి మార్టేరు బయలుదేరారు. మార్గమధ్యలో ఆలమూరు పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత బట్టీ సూర్యనారాయణ ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి, ఆటో అకస్మాత్తుగా అదుపుతప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో ఏసురాజు తలకు మరియు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను వెంటనే ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మూడు నెలల్లో మూడోసారి.. మారుతి కార్ల ధరలు పెంపు!

ప్రముఖ వాహన తయారీ సంస్థ మారుతి సుజుకి.. 2026 బాలెనో ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది కొన్ని రోజులకే, తమ ఇతర మోడల్స్ ధరలను మరోసారి పెంచనున్నట్లు వెల్లడించింది. ఈ ధరల పెరుగుదల మూడు నెలల్లో మూడోసారి కావడం గమనార్హం. కంపెనీ ప్రకారం.. ముడిసరుకుల ఖర్చులు నిరంతరం పెరుగుతున్న కారణంగా, ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ. 20,000 వరకు పెంచాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ధరల పెంపు ఈ నెల నుంచే అమల్లోకి వస్తుంది. మారుతి సుజుకి మాత్రమే కాకుండా.. కార్ల ధరలను పెంచిన కంపెనీల జాబితాలో టాటా మోటార్స్ కూడా ఉంది. 1 సెప్టెంబర్ 2026 నుంచి అమలులోకి వచ్చేలా, తమ పెట్రోల్/డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణికి గరిష్టంగా రూ.25,000 వరకు పెంపును ప్రకటించింది. హ్యుందాయ్ మోటార్ కూడా జనవరి, జూన్‌లలో చేసిన సవరణల తర్వాత ఈ ఏడాది మూడవసారిగా, సెప్టెంబర్ నుంచి తమ పోర్ట్‌ఫోలియో అంతటా ధరలు 1% వరకు పెరుగుతాయని తెలిపింది. మహీంద్రా ఉ మహీంద్రా ఇప్పటికే జూలై 2026 నుంచి ఖఙ ధరలను సగటున 2.7% పెంచింది.

# బంగారం, వెండిలో పెట్టుబడులకు షగున్ సిప్

డిజిటల్ విధానంలో పసిడి, వెండిని కొనుగోలు చేసేందుకు ఉపయోగపడేలా 'షగున్ సిప్'ను ప్రవేశపెట్టినట్లు యాక్సిస్ ఎంఎఫ్ వెల్లడించింది. యాక్సిస్ గోల్డ్ ఫండ్, యాక్సిస్ సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్‌లలో గ్రాముల లెక్కన పెట్టుబడులు పెట్టేందుకు ఈ తరహా డిజిటల్ సిప్ ఫీచరును ప్రవేశ పెట్టడం పరిశ్రమలోనే ఇది తొలిసారని పేర్కొంది. 25 కేజీల దాకా బంగారం, 50 కేజీల వరకు వెండి కొనుగోలు కు అవసరమయ్యే మొత్తాన్ని పోగు చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. డిజిటల్‌గా ఇన్వెస్ట్ చేయడంతో ఫిజి కల్ రూపంలో అదనపు వ్యయాలు, భద్రపర్చు కోవాల్సిన భారం ఉండదని సంస్థ తెలిపింది.



# చిరంజీవి-వశిష్ఠ ఇద్దరూ వేరే ప్రాజెక్టులతో బిజీ

## ‘విశ్వంభర’ రిలీజ్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో తెరకెక్కిన భారీ సోషియో ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’పై మరోసారి చర్చ మొదలైంది. భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ సినిమా విడుదల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో ఆసక్తితో పాటు కొంత అయోమయం కూడా నెలకొంది. ఒకవైపు చిరంజీవి తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉంటే.. మరోవైపు దర్శకుడు వశిష్ఠ కూడా తన కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. చిరంజీవి–వశిష్ఠ కాంబినేషన్‌లో వచ్చిన ‘విశ్వంభర’ను మొదటి నుంచే భారీ స్థాయిలో తెరకెక్కించారు. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందిన ఈ చిత్రంపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే విడుదలైన సినిమా ప్రచార కంటెంట్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా చిరంజీవిని ఫాంటసీ ప్రపంచంలో సరికొత్తగా చూపించబోతున్నారనే ప్రచారం సినిమాపై హైప్‌ను పెంచింది.అయితే ఈ సినిమా తొలుత 2025 జనవరిలో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో విడుదల వాయిదా పడింది. అనంతరం 2026 సమ్మర్‌లో విడుదల చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. ఆ షెడ్యూల్ కూడా కార్యరూపం దాల్చలేదు.ప్రస్తుతం చిరంజీవి తన తదుపరి చిత్రం ‘కాకా’ కీలక షెడ్యూల్‌లో బిజీగా ఉన్నట్లు సమాచారం. దీంతో ‘విశ్వంభర’ కంటే ఆయన ఫోకస్ ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌పై ఉన్నట్లు కనిపిస్తోంది. మరోవైపు దర్శకుడు వశిష్ఠ కూడా ఇప్పటికే నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞతో తన తదుపరి సినిమాను ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌పై కూడా ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది.దీంతో ఒకే కాంబినేషన్‌లో మొదలైన ‘విశ్వంభర’ ప్రయాణంలో హీరో, దర్శకుడు ఇద్దరూ తమ తదుపరి ప్రాజెక్టుల వైపు వెళ్లిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదే ఇప్పుడు మెగా అభిమానులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న. గతంలో ‘విశ్వంభర’ను అక్టోబర్ మధ్యలో విడుదల చేసే అవకాశం ఉందనే టాక్ వినిపించింది. అయితే ఇప్పటివరకు దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు.దీంతో సినిమా నిజంగా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందనే విషయంలో క్లారిటీ లేకుండా పోయింది. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడటంతో అభిమానులు అధికారిక అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు.

# 8 ఏళ్ల తర్వాత వస్తున్న సినిమాపై భారీ అంచనాలు

బాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి బిపాసా బసు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు ఓ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత బిపాసా బసు నటిస్తున్న కొత్త సినిమాపై బాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న పీరియడికల్ క్రైమ్ థ్రిల్లర్ ‘బారాబంకి’ లో బిపాసా బసు కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. క్రైమ్, డ్రామా అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అందుతున్న సమాచారం ప్రకారం ‘బారాబంకి’ కథ 1984లో చోటుచేసుకున్న ఓ యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఆ కాలం నాటి పరిస్థితులు, నేర నేపథ్యం, మానవ సంబంధాలను మేళవిస్తూ హన్సల్ మెహతా ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పీరియడిక్ బ్యాక్‌డ్రాప్‌లో క్రైమ్, డ్రామాను మిళితం చేస్తూ సినిమాను తెరకెక్కిస్తున్న నేపథ్యంలో.. హన్సల్ మెహతా మార్క్‌లో ఉండే రియలిస్టిక్ మేకింగ్ కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ‘బారాబంకి’లో బిపాసా బసుతో పాటు యువ నటులు సన్నీ కౌశల్, విశాల్ జేత్వా కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ హీరోయిన్ బిపాసా అనుభవంతో పాటు యువ నటుల ఎనర్జీ, హన్సల్ మెహతా విభిన్నమైన టేకింగ్ కలిసి ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతున్నాయి. అయితే బిపాసా పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం చిత్రబృందం ప్రస్తుతానికి వెల్లడించలేదు. కథలో ఆమె పాత్ర కీలక మలుపులకు కారణమవుతుందా? లేక కథను నడిపించే ప్రధాన పాత్రలో కనిపిస్తారా? అనేది సినిమా విడుదలకు దగ్గరయ్యే కొద్దీ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. బిపాసా బసు చివరిసారిగా ‘అలోన్’ సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. ఆ తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.2016లో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్‌ని వివాహం చేసుకున్న బిపాసా.. ఆ తర్వాత కుటుంబ జీవితంలో బిజీ అయ్యారు. 2022లో ఈ దంపతులకు కుమార్తె జన్మించింది. మాతృత్వాన్ని పూర్తిగా ఆస్వాదించేందుకు బిపాసా సినిమాలకు మరింత దూరంగా ఉన్నారు.ఈ కారణంగా ఆమెను వెండితెరపై మళ్లీ చూడాలని అభిమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ‘బారాబంకి’తో బిపాసా రీ-ఎంట్రీ ఇస్తున్నారనే వార్త వారిలో మరింత ఆసక్తిని పెంచుతోంది.



# రకుల్ ప్రీత్ సింగ్ రీ-ఎంట్రీకి రెడీనా..

## ఏడాదిన్నర తర్వాత మళ్లీ జిమ్‌లోకి, అసలు కారణం ఇదే!

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్‌కు ఎప్పుడు బ్రేక్ వస్తుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్లుగా వెలిగిన వారు.. ఆ తర్వాత ఒక్కసారిగా సినిమాలకు దూరమై ప్రేక్షకులకు కనిపించకుండా పోతుంటారు. ప్రస్తుతం యంగ్ హీరోయిన్ల హవా కొనసాగుతుండటంతో పలువురు సీనియర్ హీరోయిన్లకు అవకాశాలు తగ్గుతున్నాయి. కొందరు పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలో స్థిరపడుతుండగా.. మరికొందరు బిజినెస్, ఇతర రంగాలపై ఫోకస్ పెడుతున్నారు. ఇదే సమయంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. సినిమాలకు కొంతకాలంగా దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. దాదాపు ఏడాదిన్నర తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ వర్కౌట్స్ ప్రారంభించారు.

జిమ్‌లో కష్టపడుతున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. రకుల్ మళ్లీ సినిమాల్లోకి రాబోతున్నారా? అనే చర్చ మొదలైంది.రకుల్ ప్రీత్ సింగ్‌కు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. 2009లో కన్నడ చిత్రం ‘గిల్లి’తో హీరోయిన్‌గా సినీ ప్రయాణం ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో ‘కెరటం’ సినిమాతో పరిచయమైన రకుల్.. ‘వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్’ తో మంచి విజయాన్ని అందుకుని ఒక్కసారిగా టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారారు. అనంతరం పలువురు స్టార్ హీరోల సరసన నటించి వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న రకుల్.. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్.. ప్రస్తుతం హిందీ చిత్రాలపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.తాను ప్రేమించిన బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని రకుల్ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.అయితే కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంతో అభిమానులు రకుల్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గతంలో తీవ్రమైన నడుము నొప్పి కారణంగా ఆమె కొంతకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. దీంతో వర్కౌట్స్‌కు కూడా దూరంగా ఉన్నారు.తాజాగా దాదాపు ఏడాదిన్నర విరామం తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ ప్రారంభించారు. నడుముకు బెల్ట్ ధరించి జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోను రకుల్ షేర్ చేశారు. వైద్యుల సలహా మేరకు సేఫ్టీ గేర్‌తో మళ్లీ వర్కౌట్స్ మొదలుపెట్టినట్లు ఆమె వెల్లడించినట్లు సమాచారం.






# ‘రణబాలి’ టీజర్ అప్‌డేట్ వచ్చేసింది

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక జంటగా నటిస్తున్న చిత్రం ‘రణబాలి’. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకుడు. వీరిద్దరి పెళ్లి చేసుకున్న తర్వాత కలిసి చేసిన తొలి సినిమా ఇదే కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 16 ఈ సినిమా విడుదల కానుంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 9న టీజర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. కాగా ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతుండగా.. విజయ్ ఇందులో యోధుడి పాత్రలో కనిపించనున్నాడు. అజయ్, అతుల్ సంగీతం అందిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,